వార్త
ఆదివారం
3 నవంబరు, 2024





# జమిలి జటిలమా!



# అను ఇమ్మానుయేల్ కొత్త సినిమా


టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ కథానాయిక అను ఇమ్మానుయేల్ తెలుగు, తమిళంలో పలు సినిమాలు చేసింది. ఈ యంగ్ హీరోయిన్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, నాని లాంటి స్టార్స్ సరసన నటించింది. ఈ మధ్యే కోలీవుడ్‌లో 'జపాన్' సినిమాలో కనిపించింది.

ఇక.. ఈ సినిమా తరువాత అను ఓ ప్రాజెక్ట్‌ని అంగీకరించింది. ప్రముఖ ఛాయాగ్రాహకులు ఐ ఆండ్రుబాబు దర్శకునిగా డెబ్యూ ఇస్తున్న సినిమాతో అను వర్క్ చేయనున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో యువ నటుడు శివ కందుకూరి నటిస్తున్నట్లు సమాచారం.

ఆండ్రు 'ఎందుకంటే ప్రేమంట', 'తేజ్ ఐ లవ్ యు' లాంటి సినిమాలకి సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేయగా, ఇప్పుడు ఈ సినిమాతో దర్శకునిగా మారుతున్నారు. షూటింగు జరుపుకుంటున్న ఈ సినిమాకి మై3 ఆర్ట్స్, బిగ్ మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నట్లు తెలుస్తోంది.



తారాతీరం



# షూటింగ్ పూర్తయిన అనుష్క రెండు చిత్రాలు!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్కశెట్టి ప్రస్తుతం చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ఆమె నటించిన చివరి సినిమా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక అనుష్క తరువాతి చిత్రం ఎలా ఉంటుందా? అని అభిమానులు ఎప్పటినుండో ఎదురు చూస్తున్నారు.

అయితే అనుష్క సైలెంట్‌గా రెండు సినిమాలను పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. మలయాళంలో మొదటి చిత్రంగా 'కథనార్' అనే చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు దర్శకుడు క్రిష్ దర్శకత్వంలో 'ఘాటి' అనే సినిమాను కూడా చేస్తోంది. ఇప్పుడు ఈ రెండు సినిమాల షూటింగ్ పూర్తయ్యిందనీ, ఈ రెండు సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త

3 నవంబరు, 2024

## మంచి ముత్యాలు

పిల్లలకు కాస్త ప్రేమ ఇవ్వండి.
అదెన్నోరెట్లుగా తిరిగి వస్తుంది.

- జాన్ రస్కిన్

## విషయ విశేషం


తగ్గుతున్న నిద్రాగంటలు..... 4

'సంఘీ'భావం....5

ఉపాధి కల్పించలేని విద్యావ్యవస్థ

కవర్ స్టోరీ..6

జమిలి
జటిలమా!

ఒక్క రూపాయికే భోజనం...11

ఈవారం కవిత్వం..12

వసుధైక గీతం

ఐస్‌లాండ్ చూసొద్దామా!.14

వెట్టిచాకిరీ నుంచి విముక్తి...18

కథ.. 20

ది పోస్ట్

సాహిత్యం.. 23

మహాసారధి దాశరథి

కళ్యాణ క్షేత్రం 'వల్లిమలై'... 25

ద్రోహబుద్ధి మంచిది కాదు...27

ఇంటర్వ్యూలో నెగ్గాలంటే?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా..



మనకి ఏ చిన్న వస్తువు కావాలన్నా ఆన్‌లైన్‌లో తేలిగ్గా కొనేస్తుంటాం. వాటి పార్సిళ్లు ఇంటికి వచ్చినప్పుడు అట్టపెట్టెనో, కవర్‌నో గబగబా తెరిచి ఆ వస్తువులు తీసుకుని, కవర్‌ని చెత్తలో పారేస్తాం. కానీ ఆ పార్సిల్ కవర్లపైన మన ఫోన్ నంబర్‌తోపాటు చిరునామా, బ్యాంక్ వివరాలు వంటివీ స్పష్టంగా ఉంటాయి. అవేనా బార్‌కోడ్‌లూ, క్యూఆర్‌కోడ్‌లూ కూడా ఉంటాయి. వాటి గురించీ మనం పెద్దగా పట్టించుకోం. అలాంటిది మన వ్యక్తిగత వివరాలు అలా నిర్లక్ష్యంగా వదిలేయొచ్చా? ఈ సమస్యకు పరిష్కారంగా వచ్చిందే మల్టీటూర్ ఐడీ ప్రొటెక్టర్. ఇదొక రోలింగ్ స్టాంప్‌లాంటి పరికరం. మన వ్యక్తిగత వివరాలున్న చోటా, బార్‌కోడ్‌లపైనా ఈ పరికరంలో రోల్ చేస్తే చాలు. మన వివరాలు ఎవరికీ అర్థం కాకుండా అక్షరాలు గజిబిజిగా మారిపోతాయి. అలాగే దీనికున్న బ్లేడ్ సాయంతో పార్సిల్ బాక్సులని తేలిగ్గా చెరిపేయవచ్చు.

## బీపీ ఉందో లేదో తెలిపే యాప్




నాలుగు పదులు దాటితే బీపీ రావడం ఇప్పుడు మామూలైపోయింది. కాకపోతే, ఏదైనా సమస్య వస్తే కానీ మనం దానిపైన దృష్టిపెట్టడం లేదు. ఒకవేళ బీపీ ఉందేమోనని అనుమానం వచ్చినా పరీక్షలు చేయించుకోవడమంటే వెనకాడుతుంటాం. ఇప్పుడు అలాంటి పరీక్షల అవసరం లేకుండా కేవలం మన మాటల ద్వారానే బీపీ ఉందోలేదో తేల్చే మొబైల్ యాప్‌ని రూపొందించారు కెనడాకు చెందిన క్లిక్ ల్యాబ్స్ సంస్థ ఏఐ సాయంతో పనిచేసే ఈ యాప్‌ని తయారుచేసింది. మనం మాట్లాడితే చాలు మనలోని రక్తపోటుని గుర్తించే ప్రత్యేకమైన యాప్ ఇందులో ఉంటుంది. చెవి కూడా పసికట్టలేని స్వరంలోని తేడాలనీ, శ్వాసలోని హెచ్చుతగ్గుల్నీ ఇది పసిగట్టేస్తుందట. ఆ రకంగా హృద్రోగం తీవ్రం కావడానికి ముందే మనల్ని హెచ్చరిస్తుందని చెబుతున్నారు పరిశోధకులు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# తగ్గుతున్న నిద్రాగంటలు

ఎంత బలవంతంగా కళ్లు మూసినా నిద్ర రావడం లేదా? నిద్రలో ఊపిరి ఆడడం ఇబ్బం దిగా ఉన్నదా? ఇలాంటి సమస్యలు ప్రమాదకర నిద్ర లేమి రుగ్మత (స్లీప్ అప్నియా) కు కారణ మని తెలుసుకోవాలి. ఆరోగ్య వంతులకు ప్రతి రోజు రాత్రి పూట దాదాపు 7 గంటల గాఢ నిద్ర తప్పక అవసరం అవుతుంది. నిద్ర సరిగ్గా పట్టనపుడు దీర్ఘకా లిక సమస్యగా మారి అకాల మరణాలు కూడా సంభవిస్తా యని వైద్యులు అంటున్నారు. నిద్ర లేమి సమస్యలు వయస్సు, లింగ, జాతి, విద్య లాంటి అంశాల మీద కూడా ఆధారపడి ఉంటుందని తెలుస్తున్నది.

డా॥బుర్ర మధుసూదన రెడ్డి

## నిద్రలేమి రుగ్మత లక్షణాలు

నిద్రలేమి సమస్యతో హృదయ సంబంధమైన అధిక రక్తపోటు, మధుమేహం, స్ట్రోక్ రిస్క్, విపరీతమైన గురక, పండ్లు కొరకడం, శ్వాస ఇబ్బందులు, సుల భంగా అలసిపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యం పలుచబడడం, నిరాశకు గురికావడం, తలనొప్పి, అతిగా నిద్రపోవడం, మానసిక అస్థిరతకు గురికావడం, మానసిక ఆందోళనలు పెరగడం, నిద్రలేసినపుడు గొంతు ఎండిపోవడం, నిరుత్సాహ పడడం, పనిమీద ఏకాగ్రత కొరవడడం, ప్రయాణాల్లో ప్రమాదాల అవకాశం లాంటి అనారోగ్యాలు ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి. చాలామందిలో జ్ఞాప కశక్తి, ఆలోచనల సామర్థ్యాలు ప్రభావితం అవుతున్నట్లు తేలింది. వయోవృద్ధుల్లో నిద్రలేమి రుగ్మతతో ఆక్సిజన్ స్థాయి పడిపోవడం, మూర్ఛరోగానికి (ఎపిలెప్సీ) దారితీయడం జరగవచ్చు. భారతదేశంలో దాదాపు 47 మిలియన్ల ప్రజలు తీవ్రమైన నిద్రలేమి రుగ్మతతో బాధపడుతున్నట్లు తెలుస్తున్నదని, గుర్తించబడని, చికిత్స పొందని వ్యక్తులు అనేకులు ఉన్నారని తెలుస్తున్నది. స్థూలకాయులకు నిద్రలేమి సమస్యలు అధికంగా ఉంటున్నాయి. బరువు పెరగడం, మెడలు లావు కావడం, కండరాలు బలహీన పడడం, కొవ్వు పేరుకుపోవడం, ముక్కు ఎముకలు అడ్డుపడడం, నాలుక మందంగా ఉండడం, టాన్సిల్ లావెక్కడం పొగ తాగడం, థైరాయిడ్ డిస్ ఫంక్షన్, జన్యు సంబంధ కారణాలతో నిద్రలేమి రుగ్మత ప్రమాదకరంగా మారుతుంది.

## నిద్రలేమి రుగ్మతకు చికిత్సలు

నిద్రలేమి రుగ్మతను గుర్తించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి. వైద్యులు సూచించినట్లుగా జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ఉత్తమమార్గం. శరీర బరువు తగ్గడం, పొగ తాగడానికి చరమగీతం పాడడం, ఆల్కహాల్ దురలవాటును త్యజించడం, తొలిదశలోనే గుర్తించి వైద్యం తీసుకోవడం, క్రమశిక్షణతో దినచర్యను పాటించడం లాంటి చర్యలు నిద్రలేమి రుగ్మతకు చికిత్సా మార్గాలుగా గుర్తించాలి.



## 'సంఘీ' భావం



# ఉపాధి కల్పించలేని విద్యావ్యవస్థ

భారతీయ విద్యా వ్యవస్థలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు పుట్టుకు వస్తున్నా వారికి సరిపడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత నిరుద్యోగులుగా మారి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. దీనికి విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలు ప్రధాన కారణం. సాంప్రదాయ విద్యా విధానంలో మార్పులు ఆశించిన మేరకు లేకపోవడంతో విద్యావంతులైన యువత తగిన ఉపాధిని వెతుక్కోలేని పరిస్థితి ఎదుర్కొంటోంది. మనదేశ విద్యా వ్యవస్థను పరిశీలిస్తే కేవలం వైద్య విద్యను అభ్యసించినవారు మాత్రమే 90 శాతం ఆయా వృత్తుల్లో స్థిరపడుతున్నారు. ఆ తర్వాత స్థానంలో ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థ మాత్రమే కొంతవరకు ఉపాధి కల్పించగలుగుతుంది. అది కూడా అతి తక్కువగా 45 నుంచి 50 శాతం వరకు మాత్రమే ఉంది. ఇంజినీరింగ్ చదివిన అనేకమంది విద్యార్థులు ఆ వృత్తిలో స్థిరపడకుండా వేరు ఉపాధి మార్గాలు ఎంచుకుంటున్నారు. కాఫీ హోటల్‌లో, వ్యవసాయం, మార్కెటింగ్ వంటి వ్యవస్థలలో వాళ్లు స్థిరపడుతున్నారు. ఇక సాధారణ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్‌ల పరిస్థితి ఏమాత్రం మెరుగ్గా లేదు. ప్రభుత్వం ఆశించిన మేరకు ఉద్యోగాలు కల్పనలో విఫలం అవుతుంది. ఐటీ వ్యవస్థలో కొంతమంది మాత్రమే ఉపాధి పొందగలుగుతున్నారు. అయితే ప్రస్తుతం ఐటీ రంగంలో ఉన్న తీవ్ర ఒత్తిడి, తక్కువ వేతనాలు, పనివేళలు పది నుండి 12 గంటలు ఉండడంతో యువత మానసిక ఆందోళన చెందుతోంది. ఐటీ రంగంలో ఏమాత్రం ఉద్యోగ భద్రత ఉండటం లేదు. ప్రతి యేటా నిరుద్యోగుల నిష్పత్తి పెరుగుతూవస్తోంది. స్వయంఉపాధి పొందే నైపుణ్యం, ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో చిన్నాచితక ఉద్యోగాలతో సరిపెట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి రావడానికి విద్యా వ్యవస్థలో లోపాలు ప్రధాన కారణం. మారిన కాలానికి అనుగుణంగా లేని విద్యా ప్రణాళిక, బట్టీ పట్టే యంత్రాలుగా తయారు చేస్తున్న కార్పొరేట్ వ్యవస్థ ఈ సమస్యకు మరింత ఆజ్యం పోస్తోంది. ఉపాధి రంగంలో నిలదొక్కుకునే విధంగా చురుకైన యువతను ఉత్పత్తి చేయాల్సిన విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం నిరుద్యోగ ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా మారాయి. ఇప్పటివరకు జరిగిన సర్వే ప్రకారం అనేక లోపాలను వెలికి తీయగలిగారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థకు కేటాయిస్తున్న బడ్జెట్ చాలా తక్కువగా ఉండడం, విద్యను ప్రైవేటీకరించి ఒక వ్యాపార వ్యవస్థగా మార్పు చేయడం, కాలం చెల్లిన సిలబస్ కొనసాగించడం వంటి విధానాలు సమస్యగా మారాయి. కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యాబోధన కంటే మతపరమైన అంశాలు, తీవ్రవాద భావజాలాన్ని పెంచే ప్రయత్నాలను కొందరు అధ్యాపకులు ప్రేరేపిస్తున్నారు. దీనితో యువత ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత సక్రమమార్గంలో కాకుండా ఒడిదుడుకులను ఎదుర్కొనే వ్యవస్థ పట్ల దృష్టి సారిస్తుంది. చాలామంది విద్యార్థులు సృజనాత్మకత, తార్కిక ఆలోచన లేకపోవడం కూడా ప్రధాన సమస్య. గ్రాడ్యుయేషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన యువకులు యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చిన తర్వాత ప్రభుత్వమే తమకు ఉపాధి కల్పించాలన్న ఆలోచన దృక్పథం పెంచుకుంటున్నారు. సుమారుగా 60 నుంచి 80 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడంతో వారి ప్రయత్నాలు విఫలమై నిరాశ శక్తులుగా మారిపోతున్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి యువత కేవలం ఉద్యోగాల పైనే కాకుండా తమ వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉపాధి పొందే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఇది సాధించాలంటే ముందుగా ప్రాథమిక విద్య తర్వాత నైపుణ్యం కలిగిన విద్యావ్యవస్థను కొనసాగించి యువతను మల్టీస్కిల్డ్ వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. వాస్తవాల అవలోకనాన్ని అర్థం చేసుకునే విధంగా పాఠ్యాంశాల బోధన కొనసాగాలి. ఇదే సమయంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోకూడా మార్పులు రావాలి. తమ పిల్లలకు వందకు వంద మార్కులు రావాలి, స్కూల్ ఫస్ట్, జిల్లా ఫస్ట్ రావాలి అన్న ఆలోచనా విధానం మార్చుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్ కావాలని, ఇంజినీర్ కావాలని మాత్రమే తహతహలాడుతుంటారు. తమ పిల్లల్లో ఉన్నఆసక్తిని ఏమాత్రం గమనించకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకుని వారిపై ఒత్తిడి తీసుకురావడం వల్ల వారు ఎటూ కాకుండా చివరికి నిరుద్యోగులుగా మారిపోతున్నారు. యువతలో ఉన్న మేధాశక్తితో పాటు శ్రామిక శక్తిని కూడా ఉపయోగించే విధంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలి.

ప్రధానంగా కార్పొరేట్ విద్యావ్యవస్థలో కొనసాగుతున్న వ్యాపార దృక్పథం, వందకు వంద మార్కులు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకునే విధంగా చర్యలు తీసుకురావాలి. చైనా, జపాన్ లాంటి దేశాలలో కొనసాగుతున్న విద్యావ్యవస్థపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి అలాంటి విద్యా వ్యసవ్థను మన దేశంలో ప్రవేశపెట్టాలి. విశ్వవిద్యాలయం నుంచి బయటికి వచ్చిన తర్వాత యువత కేవలం ఉద్యోగాల కోసం కాకుండా స్వయం ఉపాధి పొందే విధంగా నైపుణ్యత వారిలో కల్పించాలి. విద్యావ్యవస్థకు, ఉపాధి రంగానికి ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్ కనీసం రెట్టింపు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే మన విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను కట్టడి చేసే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# జమిలి జటిలమా!

**కవర్ స్టోరీ**

**సుంకవల్లి సత్తిరాజు**

## భారతదేశం

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. భిన్నమైన భాషలతో, విభిన్నమైన సంస్కృతులలో అనేక వైరుధ్యాలు గల దేశాన్ని ఎలాంటి వైషమ్యాలు తలెత్తకుండా పాలిం చడం కత్తిమీద సాములాంటిది. సుదీర్ఘకాలం పర పీడనలో మగ్గిపోయి, వలస పాలనతో విసిగిపోయిన భారతదేశాన్ని ప్రజల ఆశలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో ముందుకు నడపాలంటే దేశానికి ప్రజా స్వామ్య విధానమే శ్రేయస్కరమని భావించి, ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలనే ఆశయంతో ఎన్నికల వ్యవస్థను ఏర్పాటు చేసారు. ఆ క్రమంలోనే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు ఏర్పడ్డాయి. ఓటు హక్కు ద్వారా చట్టసభలకు సభ్యులను ఎన్నుకునే ప్రజాస్వామ్య బద్ధమై, చట్టబద్ధమైన ఎన్నికల రంగానికి పునాది పడింది. భారతదేశంలో తొలిసార్వత్రిక ఎన్నికలు 1951–52 సంవత్సరాల మధ్యకాలంలో 68దశల్లో జరిగాయి. అప్పటికి దేశజనాభా 36కోట్లు. అప్పటి నిబంధనల ప్రకారం 21 సంవత్సరాలు నిండిన ఓటర్ల సంఖ్య సుమారు 18కోట్లు. అప్పట్లో ఓటు హక్కుగల పౌరుల్లో 80శాతంపైగా నిరక్షరాస్యులే. 1957 సార్వత్రిక ఎన్నికల్ల 47శాతం మంది, 1962లో సుమారు 55శాతం మంది ఓటర్ల తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2014, 2019,



2024 సంవత్స రాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 66శాతం మంది తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. భారతదేశంలో ఎన్నికల నిర్వహణ ఒక ఖరీదైన వ్యవహారంగా మారిపోయిన నేపథ్యంలో తరచూ ఎన్నికలు నిర్వహించడం దేశాభివృద్ధికి మంచిది కాదన్న అభిప్రాయంతో, ఎన్నికల ఖర్చును నియంత్రించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'జమిలీ' ఎన్నికల ప్రస్తావన ముందుకు తెచ్చింది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందే జమిలీ ఎన్నికలపై కొంతమేరకు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. జమిలీ ఎన్నికలు రాబోతున్నాయనే ప్రచారం ఊపందుకున్నా, ఏ కారణాల వలనో ఈ అంశం ఆటకెక్కింది. అయితే ముచ్చటగా మూడోసారి అధికారం దక్కించుకున్న మోడీ సారథ్యంలోని ఎన్.డి.ఎ 3.0 ప్రభుత్వం ఈసారి జమిలీపై పట్టుదలగా ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఇదే అంశాన్ని తన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చించి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వంలోని కమిటీ జమిలీ ఎన్నికలకు అనుకూలంగా నివేదిక సారాంశం అవగతమవుతుంది. 191 రోజులు సుదీర్ఘ అధ్యయనం చేసి, వేలాది మంది అభిప్రాయాలు సేకరించి 18రాజ్యాంగ సవరణలకు సిఫార్సు చేస్తూ, 18,629 పేజీల నివేదికను సిద్ధం చేసి, అందులో కొన్ని సవరణలకు లోక్‌సభలో సాధారణ మెజారిటీ, మరికొన్ని సవరణలకు 2/3వ వంతు మెజారిటీ, మరికొన్ని సవరణలకు సగానికి పైగా రాష్ట్రాల ఆమోదం అవసరమని సూచన చేసింది. జమ్మూకాశ్మీర్ విషయంలోను, శాసనసభలు గల కేంద్రపాలిత ప్రాంతాల విషయం లోను మరికొన్ని రాజ్యాంగ సవరణలు అవసరం. కేంద్ర కేబినెట్ రామ్‌నాథ్ కోవింద్ నివేదికను ఆమోదించి, వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని భావిస్తున్నది. ఈ బిల్లును విపక్షాలు గట్టిగా వ్యతిరేకించే అవకాశాలున్నాయి. త్వరలో జరగబోయే శీతాకాల సమావేశాలు వాడివేడి ప్రసంగాలతో పార్లమెంటులో ఎండాకాలాన్ని చవిచూపించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికల వ్యయం తగ్గించడానికి, ఎన్నికల వలన తరచూ పరిపాలనకు ఇబ్బంది కలగకుండా, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా దేశంలో జమిలీ ఎన్నికలు జరపాలని, ఆ తర్వాత నూరు రోజుల్లో మున్సిపాలిటీలకు, పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేసింది. జమిలీ ఎన్నికలు దేశానికి కొత్తమీ కాదు. గతంలోనే దేశంలో జమిలీ ఎన్నికలు జరిగాయి.

1951-52 మధ్య జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలు, 1962-1967లో జరిగిన రెండవ, మూడవ సాధారణ ఎన్నికలు జమిలీ పద్ధతిలోనే జరిగాయి. 1968-69 సంవత్సరాల మధ్య చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల వలన, 1970వ సంవత్సరంలో జరిగిన లోక్‌సభ రద్దు వలన జమిలీ ఎన్నికల ప్రస్థానం ఆగిపోయింది. ఆ తర్వాత లోక్‌సభతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి, కొన్ని అసెంబ్లీలకు విడివిడిగాను ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకురావా లనుకుంటున్న జమిలీ ఎన్నికల బిల్లు ఆమోదం పొందితే రాబోయే లోక్‌సభ ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల శాసన సభలకు, శాసనసభలు గల కేంద్రపాలిత ప్రాంతాలకు గడువు ముగిసినా, ముగియకున్నా ఒకేసారి ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది. ఒకేసారి జరిగే ఎన్నికలు ఒక్కరోజులోనే జరుపు తారా? వివిధ దశల్లో జరుపుతారా? అనే సందిగ్ధం ఇంకా కొన సాగుతూనే ఉంది. ఒక్కరోజులోనే ఎన్నికలు జరిపితే అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారుతుంది.

ఇ.వి.యంల తరలింపు నుండి సిబ్బందిని చేర్చడం వరకు శాంతిభద్రతలను కాపాడడం వరకు పెద్ద సమస్యగా మారుతుంది. కోట్లాది ఓటర్లు గల దేశంలో ఇంత ఉరుకు పరుగులతో ఎన్నికలు జరపడం అవసరమా?

## జమిలీ ఎన్నికల వెనుక మోడీ వ్యూహమేమిటి?

జమిలీ ఎన్నికలు జరపడం ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదనే భావన సర్వత్రా వ్యక్తమవుతున్నది. మోడీ ప్రభుత్వం సదుద్దేశ్యంతో జమిలీ ఎన్నికలకు వెళ్లాలని భావించి, గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చించి ఉండవచ్చు. ఈ విషయంలో ప్రధాని చిత్తశుద్ధిని శంకించలేం. ఇదే సందర్భంలో భా.జ.పా.కున్న రాజకీయ ప్రయోజనాలను కూడా శంకించకుండా ఉండలేం. రామనాథ్ కోవింద్ నివేదిక ఆచరణ సాధ్యమేనా? జమిలీ ఎన్నికల బిల్లు న్యాయసమీక్షలో నిలబడుతుందా? ఎన్ని సవరణలు తీసుకొచ్చినా ఎక్కడో ఒకచోట తప్పిదం జరగవచ్చు. బిజెపీ మిత్రపక్షాలు జమిలీ ఎన్నికలను నిజంగానే స్వాగతిస్తున్నాయా? లేక అయిష్టంగానా? ఎవరి మనసులో ఏముందో తెలియదు. హ్యాట్రిక్ ప్రధాని మోడీ అంతరంగాన్ని విశ్లేషించడం అంత సులభం కాదు. మోడీ ఆలోచనల వెనుక దాగున్న పరమార్థం ఆ పరమాత్ముడికే తెలియాలి. ప్రాంతీయ పార్టీల ఉనికి లేకుండా చేసి అన్ని చోట్ల డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం భా.జ.పా. రాజకీయ వ్యూహం కావచ్చు. అయితే ఈ వ్యూహం 'డీమోనిటైజేషన్' మాదిరిగా బెడిసికొట్టే అవకాశాలే అధికంగా ఉన్నాయి. జమిలీ ప్రయోగం విఫలమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భా.జ.పా. ఆశలు కేవలం ఆడియాసలుగా మిగిలిపోయే అవకాశాలే మెండుగా ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేక మిత్రపక్షాల సహకారంతో ప్రభుత్వాన్ని నడుపుతున్న మోడీ ఇప్పటికీ దేశంలోనే కాకుండా,



ప్రపంచంలో కూడా ఒక శక్తివంతమైన నాయకుడని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇండియా కూటమీ సభ్యుల్లో అనైక్యత, ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చలేకపోతున్నది. ఇండియా కూటమిలో ఎవరి దారి వారిదే అన్న చందంగా మారడం భా.జ.పా.కు కలిసొచ్చే అంశం. అతిస్వేచ్ఛ కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో 2029లో గాని అంతకు ముందుగాని జమిలీ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ అందుకు సంసిద్ధంగా ఉంటుందా? ఈలోగా జమిలీ ఎన్నికల బిల్లుపై వ్యతిరేకంగా గళమెత్తి ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటుందా? పార్లమెంటులో భా.జ.పా. రాజకీయ వ్యూహాన్ని నిలువరించి, బిల్లుపై తన వాణిని కాంగ్రెస్ ప్రతిధ్వనింప చేయగలదా? ప్రజలను, ప్రాంతీయ పార్టీల నాయకులను తమవైపు తిప్పుకోగలదా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత వస్తుంది.


*ఇండియా కూటమిలో ఎవరి దారి వారిదే అన్న చందంగా మారడం భా.జ.పా. కు కలిసొచ్చే అంశం. అతిస్వేచ్ఛ కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో 2029లో గాని అంతకు ముందు గాని జమిలీ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ అందుకు సంసిద్ధంగా ఉంటుం దా? ఈలోగా జమిలీ ఎన్నికల బిల్లుపై వ్యతిరేకంగా గళమెత్తి ప్రజాభి ప్రాయాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటుందా? పార్లమెంటులో భా.జ.పా. రాజకీయ వ్యూహాన్ని నిలువరించి, బిల్లుపై తన వాణిని కాంగ్రెస్ ప్రతిధ్వనింప చేయగలదా? ప్రజలను, ప్రాంతీయ పార్టీల నాయకులను తమవైపు తిప్పుకోగలదా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత వస్తుంది.*


## ఎన్నికల వ్యయం కేంద్రానికి భారమా?

లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ వ్యయం తగ్గుతుందని కేంద్రం ఆశిస్తున్నది. ప్రపంచంలో ఐదవ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, మూడవ స్థానం వైపు బలంగా అడుగులు వేస్తున్న భారత్‌కు ఎన్నికల వ్యయం కష్టతరం కాబోదు. పైగా ఇలాంటి మాటల వలన ప్రపంచంలో భారత్ గౌరవం పలచబడుతుంది. భారత్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వ్యయం సుమారు 1.35 లక్షల కోట్లకు చేరినట్టు కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి.

లోక్‌సభకు పోటీ చేసే ప్రతీ అభ్యర్థి చట్టబద్ధంగా 95లక్షల వరకు ఖర్చు పెట్టవచ్చు. శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులు 28 నుంచి 49 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. ఒక్కో లోక్‌సభ అభ్యర్థి ఎన్నికల్లో ఓటరుకు సగటున 1400 రూపాయలు పంచినట్టు కొన్ని వార్తా కథనాలు సూచిస్తు న్నాయి. పాలక బి.జె.పి. ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ తదితర పార్టీలు గత ఎన్నికల్లో లక్షల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్టు, ఇది 2019 సార్వత్రిక ఎన్నికల కంటే రెట్టింపుగా పేర్కొంటున్నారు. 68 దశల్లో నిర్వహించిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికలకు సుమారు 10.5 కోట్ల రూపాయల వ్యయం అయితే 2019 నాటికి 50వేల కోట్లు ఖర్చయింది.

2024లో 7 దశల్లో నిర్వహించిన ఎన్నికల్లో వివిధ రూపాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసిన వ్యయం లక్షకోట్లు దాటినట్లు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ నివేదికను బట్టి అవగతమవుతున్నది. ఇదొక ప్రపంచ రికార్డు. అయితే అలాగని ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగే పరిస్థితులను ఏరికోరి తెచ్చుకోగలమా? ఖర్చు పేరుతో సాఫీగా సాగుతున్న ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో నూతన విధానాలను ప్రవేశపెట్టి, లేనిపోని సమస్యలను కోరికొని తెచ్చుకోవడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ప్రభుత్వం 3870 కోట్లు ఖర్చు చేయగా, 2019లో ఇ.వి.యంల కోసం పెట్టిన ఖర్చు సుమారు 4000 కోట్లు. 15 సంవత్సరాలకుగాను ఇ.వి.ఎంలకు పెట్టే ఖర్చు 10వేల కోట్ల రూపాయలు. కేంద్రం, రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఎన్నికలకు వివిధ రూపాల్లో చేస్తున్న అధికారిక, అనధికారిక ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యయం 3 నుంచి 7లక్షల కోట్ల వరకు ఉండవచ్చునని అనధికార అంచనాలు చెబుతున్నాయి. అభ్యర్థులు వ్యక్తిగతంగా చేసే వ్యయం, రాజకీయ పార్టీలకు వివిధ సంస్థలు ఇచ్చే విరాళాలు ప్రభుత్వ ఖర్చుల కింద లెక్కపెట్టకూడదు. అభ్యర్థులు పెట్టే ఖర్చులో చాలావరకు ప్రజలకు చేరిపోవడం జరుగుతున్నది. కొన్ని నియోజకవర్గాల్లో వందల కోట్ల రూపాయలను అభ్యర్థులు పంచి పెట్టడం జరుగుతున్నది. ఎన్నికల్లో పెట్టే ఖర్చును తిరిగి రాబట్టడం కోసం జరిగే తతంగం అవినీతికి దారితీస్తున్నది. అప్పట్లో టి.ఎన్.శేషన్ ఎన్నికల నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించేటట్లు కఠినంగా వ్యవహరించే వారు. ఎన్నికల వ్యయంపై కూడా నిఘా ఉంచేవారు. అప్పట్లో ప్రధాని, ముఖ్యమంత్రులు కూడా శేషన్ కఠిన వైఖరికి భయపడే పరిస్థితులుండేవి. ఎన్నికల వ్యవస్థ అప్పటి మాదిరిగా పటిష్టంగా తయారు కావాలి. అప్పుడే ఎన్నికల ఖర్చు తగ్గుతుంది.






## జమిలీ ఎన్నికల సాధ్యమా?

జమిలీ ఎన్నికల అంశాన్ని కేంద్ర



ప్రభుత్వం మరలా ఎందుకు తెరమీదకు తెచ్చింది? ఎందుకు కొంతమంది విపక్షానికి చెందిన సభ్యులు, రాజకీయ నిపుణులు ప్రాంతీయ పార్టీలు జమిలీ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారు?

ఎందుకు కొంతమంది న్యాయనిపుణులు, భాజపా అనుకూల పక్షాలు జమిలీకి మద్దతుగా నిలుస్తున్నారు? జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. లా కమీషన్ మొదట్లో జమిలీపై సందేహాలు వ్యక్తం చేసింది. ప్రస్తుతం లా కమీషన్, నీతి అయోగ్ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తున్నాయని వార్తలు వెలువడుతున్నాయి. జమిలీ ఎన్నికలు ఆచరణాత్మమైనవి కావని అనేక విశ్లేషణలు చెబుతుండగా, రామ్‌నాథ్ కోవింద్ జమిలీకి అనుకూలంగా నివేదికనందించడం, కేంద్ర క్యాబినెట్ ఆమోదించి, దీనికి చట్టబద్ధత కల్పించడానికి వేగంగా పావులు కదుపుతున్నది. లోక్‌సభలో మిత్ర పక్షాల మద్దతుతో, బొటాబొటీ మెజారిటీతో నెట్టుకొస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి రాజ్యసభలో కూడా తగినంత మెజారిటీ లేదు. అయినప్పటికీ భాజపాకున్న రాజకీయ వ్యూహాలు, భాజపా మిత్ర పక్షాలకున్న ప్రాధాన్యతల దృష్ట్యా లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందుతుందనడంలో కించిత్తు కూడా సందేహం లేదు. అయితే 2/3 మెజారిటీతో ఆమోదించవలసిన రాజ్యాంగ సవరణల విషయం గురించి అనేక సందేహాలున్నాయి. అలాగే రాజ్యసభలో ఎన్డీఏకు మెజారిటీ లేదని విపక్షాలు భావించడం కూడా తొందరపాటే అవుతుంది. ఈ బిల్లు ఆమోదానికి భాజపాకున్న సమీకరణాలు వేరే విధంగా ఉన్నాయి.

కొన్ని రాజకీయ పక్షాలకు వాటికున్న రాజకీయ అవసరాల దృష్ట్యా రాజ్యసభలో ఎన్డీఏకు అనుకూలంగా ఓటేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

జమిలీ ఎన్నికల వలన ఉత్పన్నమయ్యే సమస్యలు

గతంలో విఫలమైన జమిలీ ఎన్నికల ప్రక్రియను వేరే రూపంలో పునరుద్ధరించాలని మోడీ సర్కార్ ప్రయత్నిస్తున్నది. బహుశా 2029లో జరిగే 19వ లోక్‌సభ ఎన్నికల్లో జమిలీ ఎన్నికల విధానం అమల్లోకి వచ్చే అవకాశముంది. అనివార్య కారణాల వలన అంతకుముందే ఎన్నికలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈలోగా 5 సంవత్సరాల కాలపరిమితి ముగియని రాష్ట్రాల శాసనసభలు కూడా రద్దవుతాయి. ఉదాహరణకు 2029లో జమిలీ ఎన్నికలు జరిగితే 2028లో ఎన్నికలు జరిగే రాష్ట్రాల శాసన సభల పరిస్థితి ఏమిటి? జమిలీ ఎన్నికల వలన ఎన్నికలు జరిగిన సంవత్సరం వ్యవధిలోనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు జరుపుతారా? ఏదైనా ఒక రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితి ముగియకుండా,



పడిపోతే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికల ద్వారా శాసన సభ్యులను ఎన్నుకుంటారా? లేదా మిగిలిన కాలానికి రాష్ట్రపతి పాలన పెడతారా? అలా జరిగితే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? ప్రజాభిప్రాయానికి విలువెక్కడ దక్కుతుంది? ఐదేళ్ల కోసం ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల తర్వాత కూలిపోతే, మిగిలిన సంవత్సర కాలమే నూతన ప్రభుత్వం పని చేయాలనే నిబంధనతో ఎన్నికలు నిర్వహిస్తారా? రాజకీయ పండితుల నుండి, రాజ్యాంగ కోవిదుల వరకు, రాజకీయ విశ్లేషకుల నుండి సామాన్య ప్రజల వరకు ఇలాంటి ఎన్నో సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. జమిలీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? ఈ ఆలోచన మోడీ మస్తిష్కం నుండే ఉద్భవించిందా? మరెవరైనా ఈ సూచన చేసారా? పదే పదే ఎన్నికలతో ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు కొంతవరకు ఇబ్బంది పడుతున్నా, ఇలా అప్పుడప్పుడూ ఎన్నికలు, ఉప ఎన్నికలు జరగడం వలన రాజకీయ నాయకులు కూడా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ చూపగలరు. ఒకసారి ఎన్నికైన ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు ఎలాంటి ఎన్నికలు లేకపోతే ప్రజాక్షేత్రానికి దూరమవుతారు. రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గిపోయి, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం కనుసన్నల్లో పనిచేసే పరిస్థితులు ఉత్పన్నం కావచ్చు. రాష్ట్రాల అధికారాలు హరించుకుపోయి, అధికార కేంద్రీకరణ జరిగి, రాష్ట్రాలు కేవలం నిమిత్తమాత్రంగా, సామంత రాజ్యాలుగా మిగిలిపోయే అవకాశాలను తోసిపుచ్చలేం. ఏది ఏమైనప్పటికీ జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పరీక్షగా మారి, రాజ్యాంగ సంక్షోభానికి దారి తీయవచ్చు.




ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల పట్ల ఉత్తరాది నాయకులు, హస్తిన పెద్దలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారనే అపప్రద ఉంది. అందుకు తగ్గట్టుగానే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ మినహా ఇప్పటి వరకు అమలు పరచిన కేంద్ర బడ్జెట్‌లలో దక్షిణాదికి అరకొర నిధులు తప్ప ఒరగబెట్టిందేమీ లేదనే ఆరోపణలున్నాయి. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తున్నారని, దక్షిణాది రాష్ట్రాలు కట్టే పన్నులతో ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేస్తున్నారని పలువురి భావన. దక్షిణాది భాషలను, వారి సంస్కృతీ సంప్రదాయాలను చిన్న చూపు చూడడం మంచిది కాదని, ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన దక్షిణ భారతదేశానికి చెందిన భాషలను గౌరవించకుండా హిందీ భాషను బలవంతంగా రుద్దాలని ప్రయత్నించడం వలన ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. గత ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జనాభా నియంత్రణకు దోహదపడిన రాష్ట్రాలకు ఇప్పుడొక చిక్కు సమస్య ఎదురౌతున్నది. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించాలనే ఆలోచన వలన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోయే అవకాశముంది.

ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, ఇండియా కూటమిలోని పార్టీలు బహిరంగంగా ఈ ఎన్నికలను వ్యతిరేకిస్తుంటే ఎన్డీఏలోని కొన్ని పార్టీల నిజమైన వైఖరి అవగతం కావడం లేదు. ప్రస్తుతం భారతదేశంలో అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికలు పలు అంచెల్లో జరుగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం వలన చట్ట సభల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చట్టసభల్లో సీట్ల సంఖ్య పెరగాలి. కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదు. జనగణన జరిగి, నియోజక వర్గాల డీ లిమిటేషన్ జరిగితే, ఉభయ తెలుగు రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే, ఇరు తెలుగు రాష్ట్రాలకు లోక్‌సభలో తమ రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. ఇదొక సమస్య. జమిలీ ఎన్నికలు ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఒక ప్రధానమైన చర్చనీయాంశంగా మారాయి. పలు ప్రాంతీయ పార్టీల్లో లోలోపల గుబులు ప్రారంభమైంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, ఇండియా కూటమిలోని పార్టీలు బహిరంగంగా ఈ ఎన్నికలను వ్యతిరేకిస్తుంటే ఎన్డీఏలోని కొన్ని పార్టీల నిజమైన వైఖరి అవగతం కావడం లేదు. ప్రస్తుతం భారతదేశంలో అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికలు పలు అంచెల్లో జరుగుతున్నాయి. అన్ని ఎన్నికలను రెండు స్థాయిలకు కుదించి, ఎన్నికల ఖర్చు తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. దాదాపు 15 పార్టీలు జమిలి ఎన్నికల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. "వన్ నేషన్-వన్ ఎలక్షన్" పేరుతో జరిగే జమిలి ఎన్నికలకు ఒకే ఓటరే జాబితా, ఒకే ఓటరు కార్డు ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు అర్థాంతరంగా పడిపోతే ఐదేళ్లకు కాకుండా మిగిలిన కాలానికే ఎన్నికలు జరుగుతాయనే ప్రతిపాదన ఎంతవరకు కార్యరూపం ధరిస్తుందో చూడాలి. "ఒకే దేశం-ఒకే ఎన్నికలు" అనే విధానం "ఒకే దేశం-ఒకే పార్టీ పాలన"గా రూపాంతరం చెందుతుందని ప్రాంతీయ పార్టీల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని పలు రాజకీయ పార్టీలు, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జమిలీ ఎన్నికల పేరుతో జాతీయ అంశాలకు ప్రాధాన్యత పెరిగి, ప్రాంతీయ అంశాలు మరుగున పడిపోతాయి. జాతీయ స్ఫూర్తి పేరుతో రాష్ట్రాల ఉనికి నామమాత్రంగా మారే అవకాశముంది.




గతంలో హిందీ భాషకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాన్ని మరచిపోలేం. ప్రాంతీయ పార్టీల ఉనికి లేకుండా చేయడానికి జమిలీ ఎన్నికల పేరుతో జరుగుతున్న ప్రయత్నాలను రాష్ట్రాలు అంగీకరిస్తాయా? గతంలో ఎన్టీఆర్ కేంద్రం మిథ్య అనేవారు. రాష్ట్రాల సహకారం లేకుండా కేంద్రం పనిచేయలేదనే సందేశమిది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలను కాదని కేంద్రం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్రాలను నామమాత్రంగా మార్చడం సముచితమా? ఫెడరలిజానికి వ్యతిరేకమైన ఈ జమిలీ ఎన్నికల విధానం రాజ్యాంగ సమ్మతమా? రాష్ట్రాల అభిప్రాయాలను కాదని బిల్లును ఆమోదించవచ్చా? సుప్రీంకోర్టు అందుకు అంగీకరిస్తుందా? సవరణలతో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చవచ్చా? జమిలీ ఎన్నికల ప్రతిపాదన ఒక చారిత్రక తప్పిదంగా ఘోర వైఫల్యంగా మారక ముందే కేంద్ర ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి, జమిలీ ఎన్నికల నిర్ణయాన్ని పునరాలోచించాలి. పూర్వకాలం రాచరిక వ్యవస్థ అమల్లో ఉండేది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా? అన్నట్టుగా వంధిమాగధుల బృందగానంలో రాజులు తరించేవారు. కానుకలను బహూకరించేవారు. చెప్పుడు మాటలతో అమాయకుల ప్రాణాలను తీసేవారు. బహుపసందైన స్తోత్రపాఠాలతో కాలక్షేపం చేస్తూ, ప్రజలను విస్మరించేవారు. ఈ విధానం ప్రస్తుతం అమల్లో లేకపోయినా, ఇదే ధోరణి పట్ల మక్కువ చూపే పాలకులకు కొదువలేదు. కొన్ని దేశాల్లో సైన్యం ప్రజల స్వేచ్ఛను హరించి, అరాచక పద్ధతులతో పాలనా పగ్గాలను చేపట్టడం చూస్తున్నాం.



భారతదేశంలో ప్రజాస్వామ్యం ద్వారా లభించిన ఓటు అనే ఆయుధంతో తమకు ఇష్టమైన ప్రజా ప్రభుత్వాలను నెలకొల్పుకునే హక్కు ప్రజలకు దక్కడం ఒక పెద్ద విజయం. ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఏర్పడిన ఒక బలమైన చట్టబద్ధమైన వ్యవస్థ. ప్రజాస్వామ్యం మనగలిగితేనే ప్రజలు స్వేచ్ఛగా జీవించగలుగుతారు. భావ వ్యక్తీకరణ ప్రజలకు లభించిన వరం. ప్రజస్వామ్యం ప్రజలకు గొంతునిస్తుంది. అరాచకాలపై పోరాడే హక్కునిస్తుంది. స్వేచ్ఛ లేని ప్రజల జీవితం కడు దుర్భరం. ప్రజాస్వామ్యాన్ని మరిస్తే ప్రజలు ఎదురు తిరిగి, తమ ఓటు హక్కు ద్వారా గుణపాఠం చెబుతారనే సత్యాన్ని పాలకులు గుర్తించాలి.

ఎంతోమంది నాయకులు ఈ దేశాన్ని పాలించారు, పాలిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజాభీష్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే, అలాంటి వారిని ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా మార్చగలిగే ప్రజాస్వామ్య వ్యవస్థలో మనమున్నాం. అయినప్పటికీ అధికారం శాశ్వతమని భ్రమించే ధోరణి మాత్రం రాజకీయాల్లో కొనసాగుతూనే ఉంది. ఐదేళ్లు, పదేళ్లు భరించి, ప్రజలు పాలకులను మార్చేస్తున్నారు. ఒక్కోసారి మెజారిటీని తగ్గించి పాలకుల దూకుడుకు పగ్గమేస్తున్నారు. భారతదేశంలో జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల శాసన సభలకు జరిగిన ఎన్నికలు భారతీయుల ప్రజాస్వామ్య స్ఫూర్తిని, పోరాట పటిమను ప్రతిబింబింపచేసాయి.

ఈ ఎన్నికల్లో 64 కోట్ల మందికి పైగా ఓటు హక్కు వినియోగించుకుని ప్రపంచ రికార్డును సృష్టించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసారు. ఈ ఎన్నికల ఫలితాలు కూడా అధికారం శాశ్వతమని భ్రమించిన నాయకులకు కనువిప్పు కలిగించాయని మేధావులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యానికి ఈ ఎన్నికలు సరైన నిర్వచనం చెప్పాయి. ప్రజాభీష్టాన్ని గౌరవించని పాలకులను ఇంటికి సాగనంపాయి. ఇదే ప్రజాస్వామ్యం గొప్పదనం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థ అత్యంత ప్రధానమైనది. అలాంటి ఎన్నికల వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దాలి. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావాలి. అయితే ఈ సంస్కరణలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా ఉండకూడదు. ఎన్నికల వ్యయం తగ్గించాలి. అయితే ఎన్నికల ఖర్చు తగ్గింపు పేరుతో ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేయకూడదు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలు జరగాలి. కేంద్రం ప్రతిపాదించిన జమిలీ ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీయకుండా చూడాలి. రాష్ట్రాల ప్రాధాన్యతను హరించకూడదు. రాష్ట్రాల సమస్యలపై పోరాడుతూ, తమ రాష్ట్రాల ప్రయోజనాల కోసం పాటు పడుతున్న ప్రాంతీయ పార్టీల అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా జమిలీ ఎన్నికల ప్రక్రియను ప్రవేశపెట్టడం సముచితం కాదని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. జమిలీ ఎన్నికల గురించి పూర్తి స్థాయి సమాచారంతో ప్రజల్లో చర్చ జరగాలి. జమిలీ ఎన్నికలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి.



# ఒక్క రూపాయికే భోజనం



క్రికెటర్‌గా, మాజీ ఎంపీగా సుపరిచితుడైన గౌతమ్ గంభీర్ కొన్నాళ్లక్రితం తన పేరుమీదే ఓ ఫౌండేషన్‌ను ద్వారా మూడేళ్లక్రితం 'ఏక్ ఆశా జన్ రసోయీ' పేరుతో మరో కార్యక్రమానికీ శ్రీకారం చుట్టాడు. అంటే..కమ్యూనిటీ కిచెన్‌ను ఏర్పాటు చేసి ఒక్క రూపాయికే భోజనాన్ని అందించే ఏర్పాటు చేశాడు. అన్నం, కూర, చపాతీ వంటివన్నీ ఒక్క రూపాయికే పెట్టే ఈ క్యాంటీన్లో ప్రతిరోజూ దాదాపు వెయ్యిమంది వరకూ భోజనం చేస్తారు. ఇక్కడకు వచ్చేవారు తామేదో ఉచితంగా తింటున్నామనే అపరాధ భావంతో ఉండకూడదనే ఉద్దేశంతోనే వాళ్ల నుంచి రూపాయి తీసుకుంటున్నామని చెప్పే గౌతమ్ గంభీర్ ఢిల్లీలోని మరో ప్రాంతంలోనూ ఈ సేవల్ని ప్రారంభించాడు. త్వరలో మరికొన్ని క్యాంటీన్లనూ ఏర్పాటు చేసే ఆలోచనలోనూ ఉన్నాడు.

## రోటీఘర్ రుచులు

రోటీఘర్...కర్ణాటకలోని హుబ్బళ్లిలో ఉండే చిన్న హోటల్. రూపాయికి అసలు ఏమీ రాని ఈ రోజుల్లో ఈ రోటీఘర్..అన్నం, కూర, పప్పు/సాంబారుతో కలిపిన భోజనాన్ని ఒక్క రూపాయికే అందిస్తుంది.



ఆటోడ్రైవర్లూ, చిన్నాచితకా పనులు చేసుకునేవాళ్లనూ కూలీలనూ దృష్టిలో పెట్టుకునే ఈ రూపాయి భోజనాన్ని ప్రారంభించామని చెప్పే ఈ రోటీఘర్ 'మహావీర్ యూత్ సంస్థాన్' అధ్వర్యంలో నడుస్తుంది. మధ్యాహనం మూడుగంటలవరకూ ఎంతమంది వచ్చినా లేదనకుండా



భోజనాన్ని వడ్డించే ఇక్కడి నిర్వాహకులు..ఈ సేవల్ని దాదాపు పదేళ్ల నుంచీ అందించడం విశేషం. విచిత్రం ఏంటంటే..పేదలే కాదు ఈ రోడ్డుమీదుగా వెళ్లే స్థానికులు సైతం ఇక్కడ ఆగి రోటీఘర్ భోజనాన్ని రుచి చూసేందుకు ఆసక్తి చూపిస్తారట. ఆకలితో ఉన్నవారి కడుపు నింపడమే లక్ష్యంగా ప్రారంభించిన ఈ ఒక్క రూపాయి భోజన కార్యక్రమానికి ఆసక్తి ఉన్నవారు ఎవరైనా సాయం కూడా చేయొచ్చు.

## నచ్చిన వంటకం తీసుకోవచ్చు

మధ్యాహ్ననమైతే చాలు.. కోయంబత్తూరులోని ఆర్ఎస్‌పురంలో ఉన్న ఇంటిముందు చుట్టుపక్కల ఉండే పేదవాళ్లు క్యూ కడతారు. ఎందుకంటే.. వాళ్లకు అక్కడ కడుపునిండా భోజనం కేవలం ఒక్క రూపాయికే అందుతుంది మరి. ఆ ఇంటి యజమాని అయిన దేవేంద్రన్ నాడార్ పేరుమీద ఓ ట్రస్టును ఏర్పాటు చేసి రూపాయికే భోజనాన్ని ఇస్తున్న ఆ కుటుంబసభ్యులు కొన్నాళ్లక్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'మధ్యాహ్నమయ్యేసరికి మొదలయ్యే ఆకలి బాధను పిల్లలే కాదు పెద్దవాళ్లూ భరించలేరు. దీన్ని అర్థం చేసుకునే కేవలం ఒక్క రూపాయిని తీసుకుని భోజనాన్ని పెట్టాలనుకున్నాం. వీళ్ల నుంచి వచ్చే ఆ డబ్బును మరో సేవా కార్యక్రమానికి ఉపయోగిస్తున్నామ'ని చెబుతారు నిర్వాహకులు. ఇక్కడకు వచ్చేవారికి పులావ్, టొమాటోరైస్, పులిహోర, పొంగలి వంటి రైస్ వెరైటీలు డబ్బాల్లో చక్కగా ప్యాక్ చేసి కనిపిస్తాయి. కావాల్సినదాన్ని రూపాయి చెల్లించి తీసుకుకోవచ్చు. ఈ అన్నానికి జతగా చిన్న పచ్చడి ప్యాకెట్, మంచి నీళ్లూ ఇస్తారు. ఒక డబ్బా నిండా వచ్చే అన్నంతో కడుపు నిండిపోతుందనీ వంటకాలన్నీ రుచిగా ఉంటాయనీ అంటారు ఇక్కడకు వచ్చే నిరుపేదలు.



# వసుధైక గీతం



నా వ్యక్తిత్వం నీకు తెలీదు
గుప్తనిధుల కోసం నేను
పరుగులెత్తను
వనధిలోని వట్టిగవ్వలే
ప్రియముగా ఏరుకుంటాను
వంచించే మాయమాటల
మతాబులా నేనెపుడూ నవ్వను
ముఖస్తుతిగా పలుకరించే
కాకరొత్తుల చిరునవ్వుల
జల్లులు వెలిగించను
నన్ను ఉత్తేజపర్చవు
పక్కదారి పట్టింది నా లక్ష్యాన్నించి
నను విముఖుణ్ణి చేయలేవు
నాది నిర్దేశిత నిష్కళంక నిరుపమాన
మానవతా మార్గం..
ఎవరూ స్పృశించని వసుధైక మార్గం
మార్గం కంటక రాజకీయాలతో
దుష్టసాధ్యం దుస్సాహసం కావచ్చు
దారిలో గులాబీల సువాసనా విభ్రమ
గుబాళింపులు కుట్ర పన్నిన
రాజకీయ
విలయ తాండవం
సందడించవచ్చు
ఏదీ నేను నమ్మిన కుశాగ్ర
మార్గం నుంచి నన్ను
పెడముఖం పెట్టించి దారి
మళ్లించవచ్చు
అయినా నేను స్థితప్రజ్ఞుణ్ణి
విశ్వనరుడను మానవత్వం
నా మహిత ధర్మం సుకృత
భాగ్యం
- సర్వేజనో సుఖినోభవంతు!

**– భూషి కృష్ణదాసు**

# చైతన్య శీలనం

నిత్య చైతన్య శీలనం
అంతర్వేద మనోగమనం
నిరంతరాయమానమైన
చైతన్యానుగమనం
అనుశీలనం/ సృజన నిండిన
భవ్య నవ్య నిత్య నూతన
శోభా ప్రాభవం.
ప్రాచీన శైశవ దశ బీజంతో
పరిణతికి మూలం.
పరిణామ దశాదిశా
నిర్దేశంతో/ అనుగమనం
నిరంతరాన్వేషణం
మనిషి నిత్య చైతన్య వైభవ ప్రాభవ
స్మృతి చిహ్నం
చైతన్యమే జీవగమనం.
నిత్య చైతన్య ప్రతీక
సూర్యోదయం
ఆ వెలుగుల వైభవంలో
చైతన్యంతో
మనిషి పురోగమనం
సులభతరం.
చైతన్యం
నిరంతర జీవ ప్రక్రియ
చైతన్యం
నిరంతర గమన శీలనం.

**– యలమంచిలి శివాజీ**

## ఈవారం కవిత్వం

# నీవొస్తావనే..



నీవు వస్తావనే
ఉత్తరం రాశాను
నిరీక్షణల తీరాల పడి
తేలిపోతూనే
వున్నాను
నీ రాకనో.. ప్రత్యుత్తరమో
వస్తుందని ఓ ఆశ!
వెన్నెల కాటేసిపోతున్న
ఓ మబ్బుచాటుకు అలికిడి
ఏ నక్షత్రాన
పలకరించినా
పెదాలపై ఓ నవ్వు
అందంగా ఈ మోహన
క్షణాలను ఆస్వాదిస్తున్నాను
నీవెప్పుడొస్తావో
ఆశల అడుగుల చప్పుడు
మనస్సై వినిపిస్తుంది
నీవొస్తావనే తలంపులో
ఈ రాత్రి
నిరీక్షణల
మైదానమంతా
వెన్నెల పరచుకొంటుంది
ఆశగా ఈ రేయిలో
నీ వైపుకే
ప్రయాణం.

**– రవి మాగంటి**

# పుస్తక సమీక్ష

## నవ అష్టోత్తర నామావళి-జ్ఞాన ప్రసూన




1968లో రావూరు సత్యనారాయణ, స్థాపించిన భాషాకుటీరం అందిస్తున్న సాహితీ సేవలలో భాగంగా వారి కుమార్తె 'మందాకిని' లిఖితపత్రిక ప్రచురింపచేస్తున్న రచయిత్రి, చిత్రకళాకారిణి, సంగీత, సాహితీవేత్త తటవర్తి జ్ఞానప్రసూన నవీననవ అష్టోత్తర శతనామావళి కుసుమమాలికను రచించి ప్రచురింపజేసారు. ఈ పారాయణ సంపుటిలో శ్రీఆంజనేయ అష్టోత్తర శతనామావళి, శ్రీశివాష్టోత్తర శతనామావళి, శ్రీవినాయక అష్టోత్తర శతనామావళి, శ్రీకార్తికేయ అష్టోత్తర శతనామావళి, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామావళి, శ్రీ సరస్వతీ అష్టోత్తర శతనామావళి, శ్రీసూర్యనారాయణ అష్టోత్తర శతనామావళి, శ్రీషిర్డిసాయి అష్టోత్తర శతనామావళి ప్రార్థనా పారాయణంగా భక్తజనులు చదువుకునే సౌలభ్యం జ్ఞానప్రసూన కల్పించడం అభినందనీయం.

**(నవీన నవ అష్టోత్తర శతనామావళి, రచన: తటవర్తి జ్ఞాన ప్రసూన, వెల: అమూల్యం, ప్రతులకు: తటవర్తి జ్ఞానప్రసూన, కదంటవర్స్, 'బి'బ్లాక్, అశోకనగర్, (పీపుల్స్ హైస్కూల్ పక్కన, హైదరాబాద్)**

– యర్రమిల్లి

## వంశధర్ కవిత్వం 'లోపలి వాన'




యిదివరలో రెండు 'నానీ' సంపుటాలు వెలువరించిన కుడికాల వంశీధర్ ప్రకటించిన వచన కవితా సంపుటి 'లోపలివాన'. 'ఏ క్షణంలోనైనా వాన పడొచ్చు/ మదిలోపలి వాన, తలపు చెక్కిలిని స్పృశిస్తుంది' ఎదలో ఉప్పొంగిన భావ ఝరి కవిత్వమై ప్రవహించే క్షణం ఆసన్నమయిందంటు ఆరంభిస్తాడు. స్వానుభవాలను, పరిసరానుభవాలను కవితలుగా మలిచి మనకు అందిస్తున్నాడు వంశీధర్. 'రోజు కూలికి ఎక్కువగా..వెట్టిచాకిరికి తక్కువగా/ సగటు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు బ్రతుకు' అంటున్నాడు యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుడికాల. 'అతను అక్కడ వేరే ప్రాజెక్టులో../ ఆమె ఇక్కడ కోడ్ రివ్యూలో/ వర్క్‌ఫ్రమ్ హోమ్‌కి వీలుగా/ ఇద్దరికీ చెరోగది' యిదీ కవి స్వానుభవం. 'ఔటర్‌రింగ్ రోడ్'ని గ్రామాలను మింగిన అనకొండతో పోలుస్తాడు..వలస బాటపట్టిన శ్రామికుల బ్రతుకులను 'కాలం కుట్టిన లదాయి అతుకులు'గా అభివర్ణిస్తాడు. 'అసంపూర్ణ కవిత', 'కొట్టివేతలు' కవితలు కవన సృజనలో కవి అంతర్మథనాన్ని పట్టియిస్తయి. ఈ సంపుటిలోని కవితలన్నీ చదివింతర్వాత కుడికాల వంశీధర్ మంచి కవిత్వంవైపు తన ప్రస్థానం కొనసాగిస్తున్నాడన్న నమ్మకం కలుగుతుంది.

**(లోపలి వాన, రచన: కుడికాల వంశీధర్, వెల: రూ 150, ప్రతులకు:2-108/7/38/1, ప్లాట్:38, ఎల్.బి.నగర్, బోడుప్పల్, బంగారు మైసమ్మ గుడి, హైదరాబాద్)**

– రమణ వెలమకన్ని

## ఎన్.టి.ఆర్‌కు వ్యాసనీరాజనం

కొందరు వ్యక్తులుంటారు. వారు ఏపని చేపట్టినా విశిష్టత కనబరుస్తారు. పదిమందిలో ఒకరుగా జన్మించినా వందమందికి మార్గదర్శకులవుతారు. కుటుంబ జీవితం, నటన, దాతృత్వం, రాజకీయ, మానవీయత ఏరంగంలోనైనా మధ్యందిన మార్తాండులై ప్రకాశిస్తారు. మాన్యులవుతారు. వారి యశోకీర్తి అజరామరమవుతుంది. అట్టి ప్రత్యేక వ్యక్తుల్లో ఆంధ్రులు మరువలేని మహామనిషి



నందమూరి తారక రామారావు. జనబాహుళ్యానికి ఎన్‌టిఆర్‌గా, నిరక్షరాస్యులకు ఎన్టీవోడుగా సినీలోకానికి అన్నగా, పదికోట్ల ఆంధ్రులకు నాయకుడిగా, ప్రజలలో నిలిచిపోయిన స్వర్గీయ ఎన్.టి.రామారావు గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన లోని ఎదో ఒక కోణం అస్పృశ్యంగా ఉండిపోతుంది. అట్టి మహా మనిషిని ఆయన శతజయంతి (28-05-2023) సందర్భంగా తెలుగు ప్రజలకు మరోసారి పరిచయం చేయాలన్న సదుద్దేశంతో 'చెన్నపురి తెలుగు అకాడమీ' వారు ఈ 500పైచిలుకు పేజీల సంచికను అందిస్తున్నారు. డా॥తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో వెలువరించబడిన ఈ సంచికలో రామారావు గురించి 108 మంది ప్రముఖులు తమతమ అమూల్యాభిప్రాయాలను వెలిబుచ్చారు. ఎన్‌టిఆర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది, అయినా, సూర్యునికి వెలుగు దివ్వెతో నీరాజనం ఇచ్చినట్లు 'ఆయన' గురించిన ఈ సంచిక అమూల్యం. **(ఎన్.టి.ఆర్, రచన: డా॥తూమాటి సంజీవరావు, వెల: రూ 800, ప్రతులకు: చెన్నపురి తెలుగు అకాడమి)**

– కూర చిదంబరం

## 'అవి వె(తె)లుగు దీపికలు'

'తెలుగు దీపికలు' పేరుతో 55మంది తెలుగు ప్రముఖుల జీవనరేఖలు పేరుతో రాఘవాచారి సంపాదకత్వంలో ఈ పుస్తకం 'కళాదీపిక' సంస్థ ప్రచురణ చేసింది. కొన్ని వ్యాసాలు అంతర్జాలు, బ్లాగులు, వికీపీడియా, వికీసోర్స్, పత్రికలు తదితర మాధ్యమాల




నుండి సేకరించి ప్రచురించారు. 1841 నాటి డొక్కా సీతమ్మ, కొక్కొండ వెంకటరత్నం పంతులు (1842) కందుకూరి రాజ్యలక్ష్మి (1851), ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1853, గురజాడ (1862), పింగళి వెంకయ్య (1878), చిలుకూరి నారాయణరావు (1889) రాళ్ళపల్లి, అనంత కృష్ణశర్మ (1893) ద్వారం వెంకటస్వామి నాయుడు (1893) బూర్గుల రామకృష్ణారావు (1899), దామెర్ల రామారావు (1897) సురవరం ప్రతాపరెడ్డి (1896), గుర్రం జాషువా (1895), గుడిపాటి వెంకటచలం (1894) తెన్నేటి విశ్వనాథం (1895), స్వామిజ్ఞానానంద (1896)లాంటి పలురంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు ఈ పుస్తకంలో విలువైన సమాచారంతో ప్రచురించారు. 1921 సంవత్సరంలో 'భీష్మప్రతిజ్ఞ' మూగచిత్రాన్ని నిర్మించిన రఘుపతి వెంకయ్య నాయుడు ప్రకాశం పంతులు..1907లోనే 13లక్షల ఆస్తిపరుడైన వ్యక్తి కాంగ్రెస్ రాజకీయాల్లో ఖ్యాతి. ఆరోజుల్లోనే 70వేల వకీలు ఫీజు తీసుకొనే నాటి స్థితి, త్యాగం చేసిన ఆస్తిపాస్తులు రాసారు.

**(తెలుగు దీపికలు, సంపాదకుడు: వి.ఎస్.రాఘవాచారి, వెల: రూ 150, ప్రతులకు: కళాదీపిక, తిరుపతి, చిత్తూరుజిల్లా)** – తంగిరాల చక్రవర్తి

ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం మధ్యలో వున్న ఒక చిన్న ద్వీపదేశం ఐస్‌లాండ్. చుట్టు నాలుగువైపులా అంతులేని జలనిధి గల ఆ ద్వీపదేశంలో మంచుపర్వతాల అందాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. రెండు కళ్లు చూసేందుకు కూడా చాలని ఈ ప్రకృతి అందాలను చూసేందుకు పర్యాటకులు చాలామందే వస్తుంటారు. ఈ ప్రాంతానికి అయ్యగారి సుజాతరావు తన కుటుంబంతో వెళ్లి, అక్కడ పర్యాటక వివరాలను, ప్రకృతివాతావరణం గురించి వారి మాటల్లోనే తెలుసుకుందాం.

# ఐస్‌లాండ్ చూసొద్దామా!



అయ్యగారి సుజాతరావు

ఐస్‌లాండ్‌లో మంచుకొండలతోపాటు అగ్నిపర్వతాలు, అవి విరజిమ్మే లావాలు, మైదాన ప్రాంతాల్లో ఇసుక భూములు, మంచు ఖండాల నుండి వచ్చేనదులు, మంచు కరిగి పర్వతాలపై నుండి దుమికే జలపాతాలు, ఆ జలపాతాలతో నేలపై ఏర్పడే నదులు, సరస్సులతో అలరారే ఆహ్లాదకరమైన వాతావరణం గల ఆ ప్రాంతాలన్ని చూడాలనే ఆసక్తితో ఐస్‌లాండ్‌కు వెళ్లాం. ప్రస్తుతం మేం అమెరికా ఒహాయో రాష్ట్రంలోని సిన్సినాటి నగరంలో నివసిస్తున్నాం. కెఫ్లావిక్ ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరి బ్లూలగూన్ అనే వేడినీటి సరస్సు దగ్గరకు వెళ్లాం. అది మానవ నిర్మిత సరస్సు, ఈ సరస్సులో స్నానం చేస్తే అలర్జీలు, రుగ్మతలు తగ్గిపోతాయని అంటారు. అంతేకాదు ఇది 25వ ప్రపంచవింతగా వాసికెక్కింది. ఇక్కడ నుంచి హెల్లా అనే ఊరికి చేరుకున్నాం. గోల్డెన్ సర్కిల్ అనే ప్రాంతంలో నేషనల్ పార్కు వుంది. ఆ పార్కులో థింగ్‌వెల్లావతన్ అనే చాలా పెద్ద సరస్సు వుంది. మంచుకొండలపై నుండి కిందకు జలజలపారే జలపాతాలు అంచెలంచెలుగా దూకుతూ వీనులవిందైన సంగీతాన్ని అందిస్తుంది. ఇలాగే వున్న చాలా జలపాతాల్లో గోల్డెన్ ఫాస్, డెట్టిఫాస్ గోడాఫాస్ ప్రఖ్యాతమైనవి. ఫాస్ అంటే జలపాతాలని అర్థమట. ఈ జలపాతాల దగ్గరకు కూడా వెళ్లవచ్చు. కొంచెం దూరంలో ఎత్తైన ప్రదేశాలలో వ్యూపాయింట్ల దగ్గర నిలబడి ఈ సౌందర్య, సుందరమైన ప్రకృతి అందాలను తిలకించవచ్చు. మంచుపర్వతాలపై నుండి మంచుగడ్డలు విరిగి చిన్నచిన్న ముక్కలుగా కిందనీటిలో పడి అలాఅలా తేలుతూ సాగిపోతూ వుంటాయి. ఆ నీటిలో బోటు షికారు చేయడం అత్యద్భుతం. ఆ సరస్సు పేరు లగూన్ లేక్. నేషనల్ పార్కులో టెక్టానిక్ ప్లేట్స్ అని భూమిపైకి చొచ్చుకొచ్చిన రాళ్లు వుంటాయి. దారికి ఇరువైపులా వ్యాపించి వున్న ఈ టెక్టానిక్ ప్లేట్స్‌ని యురేషియా టెక్టానిక్ ప్లేట్స్ అని అంటారట. ఉత్తర అమెరికా టెక్టానిక్ ప్లేట్లు ఏవి అక్కడ నుండి ఇస్లాండు వరకు వ్యాపించి వున్నాయట. ఇవి యునెస్కోవారి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించబడ్డాయి. అగ్నిపర్వతాల నుండి విరజిమ్మే లావాల ప్రభావంతో ఏర్పడిన నీటిగుంటలని కెరిడ్‌క్రేటర్లు అంటారు. ఈ నీటిగుంటలు 180 అడుగు లోతు, 560 అడుగుల వెడల్పు వుంటాయట. ఇవి 6500 సంవత్సరాల పురాతమైనవని చెప్పారు. గైజర్లు అనబడే వేడినీటి సరస్సులు 70 డిగ్రీల నుండి 100 డిగ్రీల ఆవిర్లు కక్కుతూ వుండే ఈ హాట్‌స్ప్రింగ్స్ మధ్యమధ్యలో ఫౌంటెన్‌లాగా ఒక దాని తర్వాత మరొకటి పైకి విరజిమ్ముతూ వుంటాయి. భూమి పొరల లోపల వుండే ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల కారణంగా ఈ మడుగుల్లోని నీరు వేడెక్కి పొగలు కక్కుతూ వుంటాయి. ఇలాంటి గైజర్లు దేశమంతటా వున్నాయి. సందర్శకులను కొంతదూరం వరకే అనుమతిస్తారు. ఆ వేడినీటి సెగలను తట్టుకోవడం చాలా కష్టం. డైమెండ్ సర్కిల్‌లో




గుట్టలుగా వుంటాయి. అవి స్వతసిద్ధంగా ఏర్పడిన రాళ్లగుట్టలు. అక్కడ జలపాతాలున్నాయి. నార్తరన్ లైట్లు, సదరన్‌లైట్ల అనే ఆకాశంలో మిరుమిట్లు గొలిపే, వెలుగులు విరజిమ్మే వింతవింత కాంతిపుంజాలు ప్రపంచ వింతల్లో ఒకటిగా పేర్కొనవచ్చు. విక్ అనే ఊళ్లో సముద్రపు వడ్డున వుండే ఇసుక నల్లగా వుంటుంది. అందుకనే దానిని బ్లాక్ ఆండ్ బీచి అంటారు. ఆ సముద్రతీరంలో అక్కడక్కడ చాలా లైట్‌హౌసులున్నాయి. హాఫిన్ అనే ఊళ్లో ఓడరేవు, బీచ్‌లు వున్నాయి. అక్కడ సీఫుడ్ బాగా దొరుకుతుందిట. హాఫిన్ అంటే హార్బర్ అని అర్థమట హసావిక్ అనే చోట వుండే సముద్రంలో వేల్స్ అనే పెద్దపెద్ద చేపలు వుంటాయి. ఇక్కడ సాగునీటికి మంచుకొండలే ఆధారం. వేసవికాలంలో వ్యవసాయం ఊపందుకుంటుంది. బార్లి, కూరగాయలు, క్యాబేజి, కాలిప్లవరు, బ్రకోలి, టమోటా, కారెట్, బంగాళదుంపలు లాంటి స్వల్పకాలిక పంటలు పండిస్తారు. ఐరోపా ఖండానికి అనుబంధంగా వున్నది ఈ ప్రాంతం. జనాభా తక్కువ. ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో 103000 చ.కి.విస్తరించింది. ఆగస్టు 2023 నాటికి జనాభా



375681గా నమోదు చేయబడింది. రాజధాని రెక్‌జావిక్ నగరం. తలసరి ఆదాయంతో ప్రపంచంలో నాలుగవ స్థానం వున్న ధనికులతో ఐరోపా ఖండంలోనే ధనికదేశంగా పేరుగాంచింది. చేపల వేట ముఖ్య ఆదాయవనరు అయినా ఇతర పారిశ్రామికోత్పత్తులు కూడా ఊపందుకుంటున్నాయి.

పర్యాటకరంగం అభివృద్ధి చెందడంతో ఆర్థిక, రాజకీయ, సాంఘిక స్థిరత్వం, సమానత్వంలో ఐక్యరాజ్యసమితి సూచికలో తొమ్మిదవ స్థానం ప్రపంచశాంతి సాధించిన సూచికలో మొదటిస్థానంలోను వుంది.



# యజమానులు లేని దుకాణాలు



దొంగతనాలు జరుగుతాయనే ఉద్దేశంతో పల్లెటూళ్లలోని చిన్నచిన్న కిరాణా షాపుల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్న రోజులివి. అలాంటిది దుకాణంలో ఎవరూ లేకుండా న్యాయంగా కావాల్సినవి తీసుకుని ధర్మంగా డబ్బులు అక్కడ పెట్టి వెళ్లేవారు ఎంత మంది ఉంటారు? మనదేశంలో అలాంటి గ్రామం ఒకటి నిజంగానే ఉంది. అదే మిజోరంలోని సెలింగ్. ఆ గ్రామంలో ఎక్కడ చూసినా 'ఎన్ఘ లౌర్ దార్' (యజమాని లేని దుకాణం) అనే బోర్డు రాసి పండ్లూ, కాయగూరలూ, ఇతర సరకులూ ఉంచుతారు. ఆ బోర్డుపైనే డబ్బులు ఎక్కడ ఉంచాలో రాసి ఉంటుంది. సెలింగ్ వాసులు ఈ విధంగా చేయడానికి కారణం..కరోనా కాలంలో విపరీతంగా నష్టాలొచ్చాయి రైతులకు. దాంతో తాము పండించిన పండ్లూ, కాయగూరల్ని అమ్ముతూనే వ్యవసాయం చేయడం కుదరక గ్రామస్తులంతా 'ఎన్ఘ లౌర్ దార్' పద్ధతిని పాటించాలని నిర్ణయించుకున్నారు. అందుకే రెండేళ్లుగా దుకాణదారులు యజమాని లేని దుకాణం పద్ధతిని పాటిస్తున్నారు. గ్రామంలోకి వచ్చే కొత్త వారికి తమ పరిస్థితిని వివరిస్తూ ఊరి బయట ఓ బోర్డు ఉంచారు. ఇప్పటి వరకూ అక్కడ ఒక్క దొంగతనం కూడా నమోదు కాలేదంటే నమ్మండి..

# బూడిద కూడా విలువైందే..

బతికి ఉన్నప్పుడే మనిషికి విలువ అని చాలామంది అనుకుంటారు. కానీ, చనిపోయి శరీరం బూడిదగా మారిన తరువాత ఆ విలువ అంతకు మించి పెరుగుతుందని తెలుసా. ఆ వాస్తవాన్ని కళ్లారా చూడాలంటే జపాన్‌లోని శ్మశానవాటికల దగ్గరికి వెళ్లాల్సిందే. సాధారణంగా కుటుంబ సభ్యులు చనిపోతే చితాభస్మాన్ని జాగ్రత్తగా భద్రపరిచి..పవిత్ర నదుల్లో కలిపేయడం మన దగ్గర చాలామంది పాటించే విధానం. ఫిల్లింగ్స్, బోన్ ఇంప్లాంట్స్‌కు వాడిన పల్లాడియం, టైటానియం వంటి విలువైన లోహాలు ఉంటాయని కొన్నాళ్ల క్రితం గుర్తించింది అక్కడి ప్రభుత్వం. దాంతో ఐదేళ్లలో అక్కడ చనిపోయిన 15 లక్షల మంది బూడిద నుంచి లోహాలు సేకరించి విక్రయించడం ద్వారా దాదాపు రూ.400 కోట్లను అవి ఆర్జించారు. బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేయడంతోపాటు..దేశవ్యాప్తంగా ఉన్న శ్మశానవాటికల నిర్వహణ కోసం ఆ డబ్బును వినియోగిస్తోంది ప్రభుత్వం. మొత్తానికి బూడిద కూడా విలువైందే కదూ!



కథ

# అపరిమితమైన కోరికలు

గోపయ్యకు చాలా పడవలు ఉండేవి. ఆ ఊరి నుండి ఎటువంటి ఎగుమతులు, దిగుమతులు జరగాలన్నా గోపయ్య పడవలే ఆధారం. ఎంత సంపాదించినా గోపయ్యకు ధనదాహం తీరలేదు. ప్రతిరోజూ దేవాలయానికి వెళ్లి తనకు అమితమైన ధనాన్ని ఇవ్వమని గోపయ్య ప్రార్థించేవాడు.

ఇంతలో ఆ ఊరిలోని దేవాలయానికి వార్షిక ఉత్సవాలు జరిపే సమయం వచ్చింది. ఈ విషయమై పూజారి గోపయ్యను కలిసి మాట్లాడాడు.

'అయ్యా గోపయ్యగారూ! ప్రతి ఏడాది వార్షిక ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజుల కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణకు అయ్యే ఖర్చులు తమరే భరిస్తూ వచ్చారు. ఈ ఏడాది ఇప్పటివరకు మీరు ఎటువంటి ఆర్థిక సహాయం చేయలేదు. ఆవిషయమై మీతో మాట్లాడటానికి వచ్చాను' అన్నాడు పూజారి.

'ఊరుకోండి పూజారిగారూ! మీ దేవుడు నా కోరికలేవీ తీర్చడం లేదు. అందువల్ల ఈ ఏడాది దేవాలయం కోసం ఎటువంటి ఖర్చు చేయదలచుకోలేదు' కచ్చితంగా చెప్పాడు గోపయ్య.

పూజారి మారుమాట్లాడకుండా వెళ్లిపోయాడు.

ఒకరోజు పూజారితోపాటు గోపయ్య, మరికొందరు గ్రామపెద్దలు పట్నం నుంచి తమ గ్రామానికి వస్తున్నారు. గోపయ్య పడవలో నది దాటడానికి అందరూ ఎక్కారు. దేవాలయ వార్షిక ఉత్సవాల నిమిత్తం పట్నం నుండి తెచ్చిన సరకు మూటలను పరిమితికి మించి పడవలో ఎక్కిస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసి గొపయ్య హడలెత్తిపోయాడు.

'ఆపండి పూజారిగారు! ఈ పడవెంత? దాని పరిమితి ఎంత? అనే ఆలోచన లేకుండా ఇంత బరువు వేస్తే ఎలా?' ఆవేశంగా అన్నాడు గోపయ్య.

'మీరు మోయడం లేదుకదా గోపయ్యగారు? పడవే కదా మోసేది. వేయనీయండి' అన్నాడు పూజారి.

'పరిమితికిమించి బరువు వేస్తే పడవ మునిగిపోతుంది కదా పూజారిగారు?' ఆత్రంగా అన్నాడు గోపయ్య.

'ప్రతిరోజూ మీలాంటి వేలాది భక్తులు అపరిమితంగా గొంతెమ్మ కోర్కెలు కోరుతుంటే దేవుడు మాత్రం ఎన్నని తీరుస్తాడు గోపయ్యగారు?' చురక అంటిస్తూ చెప్పాడు పూజారి.



తనకు బుద్ధి చెప్పెందుకే పూజారి ఇలా చేశాడని గ్రహించాడు గోపయ్య.

'గోపయ్యగారూ! మీకు భగవంతుడు చాలా సంపదను ఇచ్చాడు. ఉన్నదాంతో తృప్తి చెందక లేనిదానికోసం తాపత్రయ పడుతూ ప్రతిరోజూ దేవుడిని అపరిమితమైన కోర్కెలు కోరడం సమంజసమా? భగవంతుడు మీకు ఇచ్చాడు. దాన్ని మరచి భగవంతుని అపరిమితమైన కోరికలు కోరడం సమంజసమా?' ప్రశ్నించాడు పూజారి.

'నా తప్పును నేను తెలుసుకున్నాను పూజారిగారు! ఇకపై దేవుడ్ని అపరిమితమైన కోర్కెలు కోరను. దేవాలయానికి ఈ ఏడాది తొమ్మిది రోజులు జరిగే వార్షిక ఉత్సవాలలో అన్న ప్రసాద వితరణ ఖర్చును నేనే భరిస్తాను. ఘనంగా జరిపించండి' అన్నాడు గొపయ్య. పడవలో బరువును తగ్గించి అందరూ సురక్షితంగా గ్రామానికి చేరారు.

ఆరోజు నుండి గోపయ్య దేవాలయానికి వెళ్లినప్పుడు అపరిమితమైన కోర్కెలు కోరలేదు. తనకున్న సంపదతతో పేదసాదలను ఆదుకుంటూ తృప్తిగా జీవించాడు. గోపయ్యలో వచ్చిన మార్పుకు అందరూ సంతోషించారు.

– షేక్ అబ్దుల్ హకీం జాని





## బాలగేయం

### నవభారత నిర్మాతలం

మేం పిల్లలం
దేశాభ్యుదయ సూర్యులం
మేం పువ్వులం
దేశ భవితకు పునాదులం
నెహ్రూ వారసులం
కలాం స్వప్నాలం
వివేకానంద శిష్యులం
మేం పిల్లలం
నవ భారత నిర్మాతలం
ప్రగతిబాటలో ప్రయాణికులం
అంబేద్కర్ ప్రజాస్వామ్యపు
అక్షర కిరణాలం
కలలతో జీవిస్తాం
కలహాలను విస్మరిస్తాం
రాకెట్‌లా అంతరిక్షంలో
దూసుకుపోతాం
మేం పిల్లలం
గాంధి తాత గమ్యాలం!
మతాలను మాయం
చేస్తాం
మానవత్వాన్ని చాటిచెప్తాం
మేధావుల మాటలు
వింటాం
వెలిసే తారలను
కనుక్కుంటాం
మేం పిల్లలం.

**– ఫిజిక్స్ అరుణ్ కుమార్,**
నాగర్ కర్నూల్

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.భగవతి,** కొడంగల్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంటికీ మెదడుకూ సమన్వయం అన్ని సందర్భాలలో వుండి తీరవలసిందేనా?**

**జవాబు: భగవతి!** తప్పనిసరిగా ఉంటుంది, వుండి తీరాలి. ఉదాహరణకు నడక: కళ్లు తెరిచి సాధారణంగా నడుస్తున్నప్పుడు చూపు వలన కలిగే అప్రమత్తతతో మనతో నిమిత్తం లేకుండానే సవ్యమైన నడక నడుస్తాం. కళ్లకు గంతలు కట్టుకొని నడిస్తే, మన మెదడులో మార్పు కలిగి, ఆ మార్పు ప్రభావంతో అపసవ్యంగా నడుస్తాం. నేరుగా అసలు నడవలేం. కాళ్లు తడబడి, వంకర టింకరగా నడిచే పరిస్థితి వస్తుంది. ఇందుకు ప్రధాన కారణాలు రెండు. ఒకటి: మన మెదడు కళ్లకు మార్గాన్ని నిర్దేశించలేవు. రెండవ కారణం: మన శరీర నిర్మాణ వ్యవస్థ సహజంగానే అసమానతగా ఉండడంతో ఏదో ఒక పక్కకు ఒరిగిపోతాం. కళ్లకు మెదడుకు అనుసంధానం లేకపోవడంతోనే ఇది జరుగుతుంది. మన శరీరం బ్యాలన్స్ తప్పుతుంది. నడక అపసవ్యంగా మారుతుంది.

**- పి.చామంతి,** కందుకూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నీటిలోపల కూడా సిమెంట్‌ని ఉపయోగించి బ్రిడ్జిలను ఏ విధంగా నిర్మిస్తారు?**

**జవాబు: చామంతి!** మన దేశంలో నీటిలోపల జరిగే నిర్మాణాలు విషయమై కొన్ని ప్రత్యేక పద్ధతులను అవలంభిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించవలసిన చోట నీటి ప్రవాహం లేకుండా ఇసుకతో నింపిన బస్తాలతో అడ్డుకట్ట వేసుకొని నిర్మిస్తున్నారు. నీటి ప్రవాహం బాగా ఎక్కువగా ఉండే ప్రాంతంలో అయితే బ్రిడ్జి స్తంభాలు నిర్మించే చోట వెల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని నీటిని తోడివేస్తారు. ఆ తరువాత కాంక్రీట్‌తో స్తంభాలను నిర్మిస్తారు. ఇతర దేశాలలో అయితే నీటి లోపల బ్రిడ్జిలను నిర్మించే సందర్భంలో ఒక ప్రత్యేకమైన సిమెంట్ వాడతారు. అవి పటిష్టమైన బ్రిడ్జిలకు దోహదపడతాయి.







# వెట్టిచాకిరీ నుంచి విముక్తి

ఆమె ఒక సాధారణ కూలీ పనిచేసుకునే మహిళ. అయితే నేం అనేకులను వెట్టిచాకిరీ నుంచి విముక్తులుగా చేశారు. నేడు ఎంద రికో స్ఫూర్తిగా నిలిచారు. ఆమె పేరు కుప్పమ్మ. తమిళనాడు- ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న తిరువళ్లూరు జిల్లాలో కనిపించే ఇరుళర్ అనే ఆదివాసి తెగ ఆమెది. నేడు ఎన్నో జాతీయ వేదికల్లో తన గళం వినిపిస్తోంది.

కుప్పమ్మ జీవితంలో ఎదు ర్కొన్న కష్టనష్టాల గురించి ఆమె మాటల్లోనే.. అప్పట్లో నేను ఎనిమిదో తరగతి చదువుకుంటున్నా. ఉన్నపళంగా ఓ రోజు బడి మాన్పించేసి 'రేపు నీకు పెళ్లి' అన్నారు. వారం తిరక్కుం డానే నన్ను నా భర్తతో పంపిం చేశారు. ఆయనా, మా అత్తా మామలం దరూ నన్నో రైసు మిల్లులోకి తీసుకెళితే 'మాది ఎంత పెద్ద ఇల్లో' అని మురిసిపో యాను. రాన్రాను అర్థమైంది– వాళ్లందరూ ఆ మిల్లు ఓనరు వద్ద వెట్టి బానిసలుగా ఉంటు న్నా రనీ..పెళ్లితో నేనూ కొత్త బానిసగా అక్కడికి వచ్చాననీ! సంచార తెగగా వ్యవసాయ కూలీలుగా ఉండేవాళ్లం. వ్యవ సాయం తగ్గడంతో మాలో కొందరు రైసుమిల్లుల్లో పనిచేయ సాగారు. మా మామ ఎప్పుడో అలా పనిచేసేచోట గాయపడి వైద్యం కోసం రూ.5వేలు అప్పు తీసుకున్నారట. చక్రవడ్డీతో దాన్ని రూ.20 వేలుగా చేసి ఆ మొత్తం చెల్లించలేకపోవడంతో కుటుంబం మొత్తాన్నీ వెట్టి పనివాళ్లుగా చేసుకున్నాడట..దాని యజమాని.

### లోకం తెలియదు!

ఆ రైసు మిల్లుని..ఉప్పుడు బియ్యం తయారుచేసే ఫ్యాక్టరీ అనాలి. వడ్లని నానబెట్టి, ఆవిరి మీద ఉడికించి, ఆరబెట్టి బియ్యంగా బస్తాలకెత్తడం మా పని. అలా రోజూ వంద బస్తా లెత్తితే మనిషికి రూ.300 కూలీ ఇస్తారు. దాన్ని మేమివ్వా ల్సిన 20వేలకి జమ చేసేవాడు మిల్లు ఓనర్. రాత్రి తొమ్మిది నుంచీ తర్వాతి రోజు సాయంత్రం ఐదింటిదాకా పనే ఉంటుంది. ఆ తర్వాత అన్నం వండుకుని, ఆ ఒక్కపూటే తిని కేవలం మూడుగంటలు నిద్రపోయేవాళ్లం. ఆ తర్వాత మళ్లీ పనిలో పడాల్సిందే. ఊహ తెలియని వయసు కదా..నేను ఎప్పుడైనా పనిచేయనని మొండికేస్తే నన్ను నా భర్త ఎదురు గానే కొట్టేవారు. ఆ మిల్లులోకి అడుగుపెట్టాక మళ్లీ ఐదాళ్ల దాకా బయటి ప్రపంచాన్ని చూడలేదు. రజస్వలమై తీవ్ర రుతుస్రావంతో అవస్థపడ్డా బయటకు పంపించ లేదు. నేను గర్భవతినయ్యాక..కేవలం కాన్పు కోసమే బయటకు వెళ్లనిచ్చారు. మా పాపకి ఏడాది వయసొచ్చింది. జ్యోతిక అని పేరుపెట్టాను. ఓ రోజు తల స్నానం చేయించి ఉయ్యాలలో పడుకోబెట్టి వడ్లు ఆరబెట్టేం దుకని వెళ్లాను. గంట తర్వాత పాలుపడదామని వస్తే ఉయ్యాల్లో లేదు. పెద్ద పెట్టున ఏడుస్తూ వెతికితే..నీటి తొట్టెలో పడిపోయి ఉంది. స్పృహ లేదు. గుండెలు బాదుకుంటూ ఆసుపత్రికి తీసుకెళతానని అకౌంటెంట్ దగ్గరకెళ్లాను. 'ఓనర్ లేడు..వచ్చేదాకా ఆగు' అన్నాడు. ఊపిరి ఉగ్గబట్టుకుని పాప గుండెలపైన కొడుతూ నీళ్లు కక్కించడానికి ప్రయత్నిస్తూ వేచి చూశాను. యజమాని వచ్చీరాగానే విషయం చెబితే 'నీ పిల్ల బతికితే ఎంత చస్తే ఎంత..బియ్యం బస్తాలకెత్తడం అయినాకే వెళ్లు' అన్నాడు. ఆయన కాళ్లమీద పడి వేడుకున్నాను.

బతిమాలగా బతిమాలగా అతని మనసు కరిగి ఆసుపత్రికి వెళ్లేసరికి..నా పాప శవమైపోయింది. 'ఆలస్యంగా తెచ్చారమ్మా..' అని వాళ్లు అంటుంటే పేగులు కదిలేలా ఏడుస్తూ ఉండిపోయాను. నా పాపకి అంత్యక్రియలు చేయడానికి ఆ ఊళ్లో వాళ్లు ఒప్పుకోలేదు. సొంతూరు వెళ్లమన్నారు. 'పనిమాని వెళ్లడానికి వీల్లేదు, ఆ బియ్యంపోటున్న కాల్చేచోట పాతేయండి' అన్నాడు మా ఓనర్. నా జీవితంలో ఓ మనిషిని చంపేసేంతటి కోపం అప్పుడొచ్చింది నాకు! ఏది ఏమైనా నేను బిడ్డని తీసుకుని మా ఊరెళతానని మొండికే శాను. చివరికి అతను ఒప్పుకుని పంపించేశాడు. కానీ ఆరోజే మా ఇంటికి మనిషిని పంపించాడు..పనిలోకి రావాల్సిందే నంటూ. బిడ్డ పోయిన బాధ నుంచి కాస్తయినా తేరుకోకుండా ఎలా వస్తాం అని తిరగబడే తెగువ నా భర్తకో మరుదులకో మామకో లేదు. మేం అలా బానిసలుగా ఉండటానికే పుట్టా మనీ..మా తల రాత అంతేనని వాళ్లు నమ్మారు. చేసేదేమీ లేక నేనూ వాళ్లతోపాటూ మిల్లుకి వెళ్లాను. జ్యోతిక చనిపోయి అప్పటికే నాలుగేళ్లు. రెండో పాప పుట్టి తప్పటడుగులు వేస్తోం ది. ఓ రోజు మేము ఉడికించిన వడ్లు ఆరబెడుతూ ఉంటే.. తను నన్ను పిలుస్తూ..అందులో నుంచి నడిచి వచ్చేసింది. అరికాళ్ల బొబ్బలు తేలి బోరున ఏడుపు మొదలుపెట్టింది. తనని తీసుకుని ఆసుపత్రికి వెళదామంటే 'కాళ్లకి బురదమన్ను పూసెయ్. బియ్యం బస్తాలకెత్తాక ఆసుపత్రికి వెళుదువుకానీ' అన్నాడు యజమాని. నా కోపమంతా అణచుకుని కాలు కిందపెడితే విలవిల్లాడుతున్న పాపని చంకనెత్తుకునే పనులన్నీ పూర్తిచేసి ఆసుపత్రికి వెళ్లాను. పాప పాదాలు చూసి..డాక్టర్లు నన్నే తిట్టారు 'నువ్వూ తల్లివేనా!' అని. ఏం చెప్పను నేను? పాపకి ఐదేళ్లు వచ్చాక ఓ రోజు నా బిడ్డని స్కూల్లో చేరుస్తా నన్నాను. 'వెట్టిదాని కూతురు వెట్టిదవుతుంది..చదివి కలెక్టర్ అవుతుందా?' అన్నాడు యజమాని వెటకారంగా.



# చిన్నవయసులోనే సక్సెస్ బిజినెస్

అతని పేరు కునాల్‌షా.

చిన్నవయసులోనే పలు బిజినెస్ అవార్డులను పొందాడు. మన ఆర్థిక రాజధాని అయిన ముంబయిలో 1983 మే 20న జన్మించాడు. 2000 నాటికి స్టార్టప్ కంపెనీ ప్రారంభించాడు అంటే నమ్మగలమా! 2015 ఫోర్బ్స్ ఇండియా లీడర్‌షిప్ అవార్డు, 2016 ఆంత్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, 2017 టాప్ క్రియేటివ్ సిఇవో అవార్డు, 2018 యంగ్ బిజినెస్ మాన్ అవార్డు, 2019 ఇండియాస్ మోస్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆంత్రప్రెన్యూర్ అవార్డు, 2020 ఇంపాక్టుఫుల్ టెక్ లీడర్ వంటి అవార్డులు ఎన్నో వరుసగా అందుకున్న యువకుడు కునాల్‌షా. కునాల్‌షా ఇంత చేసాడు అంటే మనం ఏమనుకుంటాం? ఇతడు పెద్ద వ్యాపార కుటుంబం నుంచి వచ్చాడు, విదేశాలలో పెద్ద పేరున్న విద్యాసంస్థల నుండి బిజినెస్ బిరుదు పొంది ఉంటాడని అనుకుంటాం. కానీ అలాంటి నేపథ్యం ఏమీ లేదు. కునాల్‌షా కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే, చదవడానికి కాలేజికి రెండుగంటలు వెళ్లి మిగతా సమయం అంతా కుటుంబం కోసం సంపాదనకు కేటాయించే వాడు. అరకొర మార్కులతో ఫిలాసఫీలో డిగ్రీ పూర్తి చేసాడు. ఆ సమయంలో డెలివరీ బాయ్, మెహందీ పనులు, సిడిల అమ్మకం ఇంటర్నెట్ సెంటర్లు నడపడం, కంప్యూటర్ ఆపరేటర్ ఇలా ఎన్నో పనులు చేసి వినియోగదారుల నాడి గమనించేవాడు. అర్థాకలితో సరైన నిద్ర రాక ఎదుటి వ్యక్తుల అవసరాలను గమనించి స్టార్టప్ మాంత్రికుడు అయ్యాడు కునాల్‌షా. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఆర్థికంగా కొంత సమకూర్చుకుని 2009లో పైసా బ్యాక్ స్టార్టప్ ప్రారంభించాడు. దీని ద్వారా డిస్కౌంట్ కూపన్లు అందించాడు. 2010లో సందీప్ టాండన్‌తో చేతులు కలిపి ఫ్రీఛార్జ్ అనే స్టార్టప్ తెచ్చాడు. దీని ద్వారా సెల్‌ఫోన్ రీఛార్జ్ సులువుగా చేసుకోచ్చు. రీఛార్జ్ వ్యాపారం ఊహించని విజయాన్ని అందుకుంది. వీరు ఈ సంస్థని 3వేల 5వందల కోట్ల రూపాయలకు అమ్మేసారు. ఈ లావాదేవీలు అప్పట్లో పెను సంచలమే రేపింది. కునాల్‌షా పేరు దేశమంతా తెలిసిపోయింది. మనదేశంలో డిజిటల్ పేమెంట్ విధానం బాగా ఊపు అందుకుంటోంది అని గ్రహించి 2018లో క్రెడ్ నిర్వహిస్తోంది. నేడు క్రెడ్ టర్నోవర్ 18వేల కోట్ల రూపాయల టర్నోవర్ అందుకుంది. వినియోగదారుల అవసరాలే తన విజయం అంటాడు కునాల్‌షా.

**– ఈ.ఎస్.మాధవన్**

---

అప్పుడు..ఆ క్షణాన..నాలో ఏ ఆవేశం వచ్చిందో తెలియదు.. అతనిపైన తిరగబడ్డాను. ఆ రోజు అతనూ మిగతా పనివాళ్లూ కలిసి ఒళ్లు వాతలు తేలేలా కొట్టారు. కానీ ఆ సంఘటన తర్వాత మరింత మొండిగా మారాను. 'మా మామయ్య తీసుకున్న డబ్బుకి నేను బానిసగా ఉండాలా..' అని ప్రశ్నించ సాగాను. ఇదంతా అక్కడ లారీకి బస్తాలు మోయడానికి వచ్చిన ఓ కొత్త వ్యక్తి గమనిం చాడు. అతను ఏమయిందని అడిగితే మాకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పాను. తను ఫిర్యాదు చేస్తాననీ త్వరలోనే అధికారులొచ్చి మమ్మల్ని విడిపిస్తారనీ అతను చెప్పాడు. కానీ అధికారులు వచ్చేరోజు ఆ విషయం ముందుగా తెలిసి మా ఓనర్ మమ్మల్ని చీకటి గిడ్డంగిలో బంధించాడు. మిల్లుకి తాళం వేసి పారిపోయాడు. అర్ధరాత్రి మా మిల్లు బయట అధికారుల అలికిడి నాకు వినిపించింది. 'లోపల ఎవరూ లేనట్టున్నారు. మనకి తప్పుడు సమాచారం ఇచ్చారేమో' అన్న వాళ్ల మాటలు వింటుంటే నా గుండెలు జారిపోయాయి. మమ్మల్ని విడిపించకుండానే వెళ్లిపోతారే మోనని భయమేసింది. అంతే, మా వాళ్లందరూ వద్దంటున్నా వినకుండా 20 అడు గులు ఎత్తున్న ఆ గోడ ఎక్కి అటువైపు దూకేశాను. కాలి మడమ విరిగిపోయింది. అలానే కాళ్లీడ్చు కుంటూ వెళ్లి అధికారుల ముందు నిల్చున్నాను. వాళ్లలో ఓ మహిళ ఉంటే..ఆమెని పట్టుకుని బోరున ఏడ్చేశాను. వాళ్లు తాళం బద్దలు కొట్టి లోపలికి వెళ్లి మావాళ్లందరినీ బయటకు తెచ్చారు. నా వాం గ్మూలంతో యజమానిని అరెస్టు చేశారు. తమిళనాడులో తిరువళ్లూరు జిల్లాలో నాలాంటి ఎంతోమంది వెట్టి చాకిరి చేస్తున్నారని తెలుసుకున్నాను. నేనే ముందుండి వెయ్యి మంది బానిసల్ని అలా విడి పించడంతో..అధికార వర్గాల్లో నాకు బాగా గుర్తింపు వచ్చింది. కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో అందరికీ రేషన్ కార్డులూ ఆధార్‌కార్డులు ఇప్పించాను. మాలాంటి వాళ్లందరం కలిసి 'రిలీజ్డ్ బాండెడ్ లేబర్ అసోసియేషన్) (ఆర్‌బీ ఎల్‌ఏ) అనే సంస్థ ని ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం కూడా మాచేత మహిళా సంఘాలని ఏర్పాటు చేయించి ఉపాధి చూపించింది.

కథ

# ది పోస్ట్

వెంకట నాగేంద్ర మాగంటి

రాఘవయ్య ఆరోజు ఉదయమే లేచాడు. స్నానాదులు చేసి భోజనం చేశాడు. ఆరోజు ఆయన ముఖం మీద ఆందోళన తాండవం చేసింది. భర్త ఎందుకు అంత ఆందోళనలో ఉన్నాడో ఆయన సతీమణి సావిత్రికి అర్థం కాలేదు. రాఘవయ్య ఏదో విషయం మీద అనర్గళంగా ఆలోచిస్తున్నాడు.

ఏం ఆలోచిస్తున్నాడో సావిత్రికి అర్థం కావట్లేదు. అలా కొంతసేపు దీర్ఘాలోచన తర్వాత ఆయన బీరువా సొరుగులోని ఉత్తరాన్ని తీసుకున్నాడు. అప్పుడు అర్థమైంది సావిత్రికి విషయం. ఆయన ఆ ఉత్తరాన్ని, మళ్లీ అదే ఉత్తరం పంపించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం రాసిన ఉత్తరం అది. ఐదు సంవత్సరాలుగా దాచిన ఉత్తరం అది. ఆ ఉత్తరాన్ని ఇప్పటికీ పోస్ట్ చేయలేదు. నెలకోసారైనా ఉత్తరాన్ని తీసి రాఘవయ్య చదువుకుంటాడు. ఆరు మాసాలకోసారైనా ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేయడానికి పోస్టాఫీసు వరకు వెళ్లి, పోస్ట్ చేయకుండానే తిరిగి వస్తాడు. "ఇలా అప్పుడప్పుడు జరిగే తతంగమే ఇది" అనుకొని వంటగదిలోకి పోయి పనులు చేసుకుంటోంది సావిత్రి.

ఆ ఉత్తరాన్ని పట్టుకొని బయటికి వచ్చాడు రాఘవయ్య. బయట నుండి వంటగదిలోకి వినిపించేలా "ఏమేవ్! నేను అలా వెళ్లి వస్తా" అని రాఘవయ్య గట్టిగా అరుస్తాడు.

దానికి సావిత్రి "సరే.. జాగ్రత్తగా వెళ్లిరండి" అని రాఘవయ్య అంత గట్టిగా కాకపోయినా బయటకి వినబడేలా చెబుతుంది. గేటు దాటి రోడ్డు మీద అడుగులు వేస్తూ నడుస్తున్నాడు రాఘవయ్య. అటుగా వెళుతున్న ప్రసాదరావు ఉత్తరం పట్టుకుని నడుస్తున్న రాఘవయ్య పలకరిస్తాడు.

"ఏమండోయ్ రాఘవయ్యగారు ఎటువైపు నడక?"

"ఇక్కడికే... చిన్న పని ఉండి బయలుదేరా"

"అయ్యబాబోయ్.. చిన్న పనంటారేంటండీ? పోస్ట్ చేయడానికి వెళ్తుంటే" ప్రసాదరావు వ్యంగ్యంగా ఆ మాట అన్నా కూడా ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేయటం రాఘవయ్యకు చాలా పెద్ద విషయం. దానికి కారణం ఆ ఉత్తరం పైన ఉన్న చిరునామా, ఆ ఉత్తరం లోపల ఉన్న విషయం. ఐదు సంవత్సరాల నుండి రాఘవయ్యను ఇవే పోస్ట్ చేయకుండా ఆపుతున్నాయి. ఏదో ఒకటి చెప్పి ప్రసాదరావు నుండి తప్పించుకోగలిగాడు రాఘవయ్య.

దారిలో ఇంకెవరికీ ఆ ఉత్తరం కనబడకుండా తలపాగలో పెట్టుకుని తలకు చుట్టేసుకున్నాడు. మెల్లగా నడుచుకుంటూ పోస్టాఫీసుకు వచ్చేసాడు. అక్కడ పోస్ట్ బాక్స్ ఈసారైనా ఉత్తరం వెయ్యి అన్నట్టు జాలిగా చూస్తుంది. ఆ ఉత్తరాన్ని తలపాగా నుండి తీశాడు. అక్కడే కూర్చొని ఉన్న పోస్ట్‌మాన్ ఈసారైనా ఉత్తరం వేస్తాడేమో అని ఆశగా చూస్తున్నాడు. రాఘవయ్య మదిలో ఆలోచనలు తరంగాల్లా పరిగెడుతున్నాయి.

మితిమీరిన ఆలోచనలకు సంకేతంగా చెమటలు శరీరమంతటా ప్రవహిస్తున్నాయి. అసలు ఆ ఉత్తరంలో ఏముందో పోస్ట్‌మాన్‌కు అర్థం కాలేదు.

"ఎందుకు అతను పోస్టు చేయలేకపోతున్నాడు? అతను పోస్ట్ చేయలేకపోతున్నా, పోస్ట్ చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాడు" అన్నది పోస్ట్ మాన్‌కు అంత పట్టని విషయం. అక్కర్లేని విషయం కూడాను. రాఘవయ్య ఉత్తరాన్ని పోస్ట్ బాక్స్‌లో వేయకుండా అక్కడే పక్కనున్న బల్ల మీద కూర్చున్నాడు. ఆ ఉత్తరాన్ని పక్కనే పెట్టుకుని దాని వంక చూస్తున్నాడు. అదంతా దూరం నుండి చూస్తున్న పోస్ట్‌మాన్ ఆ బల్లబరువు తెలిపే కాంటాలాగా అనిపించింది. ఆ ఉత్తరం బరువుకు రాఘవయ్య తేలిపోతున్నట్టు కనిపించింది. రాఘవయ్య ఆలోచనల పరంపర ఇంకా ఆగలేదు. మనిషి నవ్వినా తెలిసిపోతుంది, ఏడ్చినా తెలిసిపోతుంది.




ఇలా మనిషి ఏం చేసినా తెలిసిపోతుంది. మానవుడు రహస్యంగా చేయగలిగేది ఆలోచించడం మాత్రమే. ఆరోజు అది కూడా తెలిస్తే బాగుండు.. అనుకున్నాడు పోస్ట్‌మాన్.

**రాఘవయ్యకు పది యేళ్ల వయసు ఉన్నప్పుడు ఆడపిల్ల లేదని, మూడేళ్ల ఆడపిల్లని దత్తత తీసుకుంది రాఘవయ్య తల్లి సీతమ్మ. ఆ చిన్న పిల్లకి యశోద అని పేరు పెట్టుకుంది. రాఘవయ్య అతని చెల్లి యశోద కలిసి పెరిగారు.**

రాఘవయ్య ఉత్తరాన్నే చూస్తున్నాడు. ఎటు చూసినా తనకు అదే కనబడుతుంది. రాఘవయ్యకు మెల్లగా తలపోటు మొదలైంది. ఈ తలపోటు రాఘవయ్య టైం టేబుల్‌లో ఒక భాగం అయిపోయింది. చదువుకునే సమయం, వ్యాయామం చేసే సమయం అలాగే తలపోటు తెచ్చుకొని భరించే సమయం. ఇలా ఐదు సంవత్సరాల నుండి టైం టేబుల్‌లో తలపోటు భాగం అయింది. పోస్ట్‌మాన్‌కు విషయం అర్థమైంది. ఇక ఆ ఉత్తరాన్ని ఆయన పోస్ట్ చేయడు అని నిశ్చయించుకుని రాఘవయ్య దగ్గరకు వచ్చాడు.

“అయ్యా, రాఘవయ్యగారూ! ఉత్తరాలన్నీ తీసేసే టైం అయింది. మీరు ఉత్తరం వేయాలి అనుకుంటే వేసేయండి” అని పోస్ట్‌మాన్ అన్నాడు. దానికి ఏం సమాధానం చెప్పాలో రాఘవయ్యకి తెలియలేదు. వేయలేకపోతున్నాడు. వెయ్యలేను అని చెప్పలేకపోతున్నాడు. పోస్ట్ మాన్ బాక్స్ తీసి అందులో ఉన్న ఉత్తరాలన్నీ పట్టుకొని వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయిన గంటసేపటి తర్వాత మళ్లీ ఆ ఉత్తరాన్ని తలపాగాలో పెట్టుకుని తలకు చుట్టుకుని ఇంటిముఖం పట్టాడు. రిక్త హస్తాలతో రాఘవయ్య రావడం చూసి ఆశ్చర్యపడింది సావిత్రి. కలియుగాంతంలో కల్కిని చూసినంత ఆశ్చర్యపడింది. “ఏంటండీ! ఉత్తరం పోస్ట్ చేశారా?” అని అడగగానే–

రాఘవయ్య తలపాగా నుండి ఉత్తరం తీసి “బీరువా సొరుగులో పెట్టు” అన్నాడు.

అప్పుడు విషయం అర్థమైంది సావిత్రికి. బీరువా తలుపు తెరచి ఉత్తరాన్ని భద్రంగా పెట్టేసింది. మరుసటి రోజు సావిత్రి సమేతంగా రాఘవయ్య అమ్మవారి గుడికి వెళ్లాడు. లావుగా ఉన్న కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని ప్రార్థించాడు. దక్షిణ కింద 116 రూ।। తీసి హుండీలో వేయబోయాడు. ఆ హుండీ పోస్టు బాక్స్‌లాగా ఉంది. వెంటనే ఆ ఉత్తరం తాలూకు ఆలోచనలు వచ్చేసాయి. దక్షిణ కూడా ఇవ్వకుండా వెనక్కి వచ్చేసాడు. ఉత్తరం దేని గురించి, ఎవరికోసమో తెలుసుగానీ అసలు ఆ ఉత్తరంలో పూర్తిగా ఏముందో సావిత్రికి కూడా తెలియదు. ఆ ఉత్తరం ఐదు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనకి వివరణ, క్షమాపణ. మరి దాన్ని పోస్ట్ చేయడానికి రాఘవయ్యను ఏమాపుతోంది? మర్యాద, స్థాయి, ప్రతిష్ట ఇంకా ఇలా.. ఎన్నో. అందరూ తప్పు చేయడానికి ఆలోచించరుగానీ క్షమాపణ కోరడానికి మాత్రం ఆలోచిస్తారు. తప్పు చేసే స్థాయి తగ్గిపోదుగానీ, క్షమాపణ కోరితే స్థాయి తగ్గిపోద్ది అనుకుంటారు. రాఘవయ్య కూడా ఇలానే అనుకుంటున్నాడు. క్షమాపణ కోరితే తాహతు తగ్గిపోద్ది అని భావిస్తున్నాడు. క్షమాపణ కోరలేనివారు తాము చేసిన తప్పు చిన్నదని అనుకుంటారు. ఎవరికి ఏం అవ్వలేదని, ఏం పర్లేదు అని అనుకుంటారు. కానీ రాఘవయ్య అలా అనుకోవడానికి లేదు. తాను చేసిన తప్పు చిన్నది అనుకుంటే హిందూ మహాసముద్రం కూడా చిన్నదే. ఎవరెస్ట్ పర్వతాలు కూడా చిన్నవే. ఆఖరికి ఆకాశం కూడా చిన్నదే.

రాఘవయ్యకు పదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆడపిల్ల లేదని, మూడేళ్ల ఆడపిల్లలని దత్తత తీసుకుంది రాఘవయ్య తల్లి సీతమ్మ. ఆ చిన్న పిల్లలకి యశోద అని పెట్టుకుంది. రాఘవయ్య అతని చెల్లి యశోద కలిసి పెరిగారు. ఇద్దరు కలిసి ఆడుకునేవారు. ఇద్దరూ కలిసి చదువుకునేవారు. వారి మధ్య ఉన్న బంధాన్ని, ఆప్యాయతను చూసి సీతమ్మ మురిసిపోయేది. కానీ వయసు పెరిగేకొద్దీ బంధం భారం అయింది. ఆప్యాయత తగ్గిపోయింది. ఆస్తినంతా యశోద తన్నుకుపోతుందని భయం వేసింది రాఘవయ్యకి. పేగు తెంచుకుని పుట్టిన తనకు, పక్కింటి నుంచి వచ్చిన యశోదకు ఒకే రకమైన ప్రాధాన్యత ఇవ్వడంతో యశోద మీద ద్వేషం పెరిగింది రాఘవయ్యకి.

సొంత తోబుట్టువులకే ఆస్తి గొడవలు సహజం. అలాంటిది వీరి విషయంలో ఆస్తిగొడవలు రావడం విచిత్రం కాదు. మెల్లగా యశోదను దూరం పెట్టడం మొదలుపెట్టాడు రాఘవయ్య. కొన్ని సంవత్సరాలకి రాఘవయ్య యశోదకు పెళ్లి కుదిర్చాడు. ఈ పెళ్లి కుర్చింది చెల్లి మీద ప్రేమతోనో, అన్నయ్య అనే బాధ్యతతోనో కాదు. వేరేవాడైతే కట్నం కింద సగం ఆస్తి ఇవ్వాలని, కట్నం తీసుకోని, మానసిక పరిస్థితి సరిగా లేని యువకుడ్ని తెచ్చి పెళ్లి చేశాడు. పెళ్లి పేరుతో యశోదను చాలా దూరం పంపించేశాడు. తల్లీ కూతుళ్లను విడదీశాడు. సంక్రాంతికో, దీపావళికో యశోద వచ్చినా, ఇష్టం లేనట్టు ప్రవర్తించి అగౌరవపరిచేవాడు. చెల్లెలు వచ్చినప్పుడు నీరసంగా స్వాగతించేవాడు, వెళ్లేటప్పుడు ఉత్సాహంతో సాగనంపేవాడు. భోజనం కూడా వేళ దాటాకే వడ్డించేవాడు. ఇక మర్యాద సంగతి చెప్పనక్కర్లేదు. అన్న ఉద్దేశం యశోదకు అర్థమై అప్పుడప్పుడు కూడా రావడం మానేసింది యశోద. అలా యశోద రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. కూతురు రాకపోయినా సీతమ్మ మాత్రం కూతురింటికి నెలకోసారైనా వెళ్లేది. వెళ్లేటప్పుడు మామిడి పండ్లు, కూరగాయలు బుట్టలు బుట్టలు తీసుకువెళ్లేది రాఘవయ్య ఏదో కారణం చెప్పి తల్లిని ఆపడానికి ప్రయత్నించేవాడు. కానీ సీతమ్మ ఆగేది కాదు. రాఘవయ్య ఎంత చెప్పినా వినకుండా కూతురింటికి వెళ్లేది. కూతురితో గడిపేది. సీతమ్మకు కొడుకు ఇంట్లో అసలు నిద్ర పట్టేది కాదు. కూతురింట్లో మాత్రం ప్రశాంతంగా నిద్ర పోయేది.

చాలా సంవత్సరాల తర్వాత ఓ రాత్రి రాఘవయ్య ఇంట్లో నిద్రపోయింది కాకపోతే శాశ్వతంగా. ఆరోజు ఉదయపు కాంతి సీతమ్మ మీద పడలేదు. ఆరోజు చల్లని గాలి సీతమ్మకు తగల్లేదు. సీతమ్మ మరణవార్త ఊరంతా వ్యాపించింది. రాఘవయ్య ఇంటి ముందు ఎర్రటి టెంట్లను వేయించాడు. సీతమ్మను చివరిసారి చూడటానికి చాలామంది వచ్చారు. కొంతమంది సీతమ్మ ఎలా బతికిందో చెబుతున్నారు. ఇంకొంత మంది సీతమ్మ ఎందుకు చనిపోయిందో అడుగుతున్నారు. ఒకవైపు ఏడుపులు, మరోవైపు పూర్తిగా నిశ్శబ్దం. ఇలా ఒక చావు ఇల్లు ఎలా ఉండాలో అలానే ఉంది. సీతమ్మ మరణవార్త యశోదకు చేరింది. ఆ వార్త విన్న వెంటనే యశోద గుండె ఆగిపోయింది వెంటనే సీతమ్మని చూడడానికి బయలుదేరింది.

యశోద ఉన్న ఊరి నుండి రాఘవయ్య ఇంటికి చేరాలంటే ఆరు గంటలు ప్రయాణం చేయాలి. యశోద రాఘవయ్యకి ఫోన్ చేసి "సాయంత్రంకల్లా వచ్చేస్తాను" అని చెప్పింది.

తన తల్లిని యశోద చివరిసారి చూడటం రాఘవయ్యకు నచ్చలేదు. సీతమ్మ యశోద దగ్గరికి వెళ్లేటప్పుడు ఎన్నోసార్లు ఆపడానికి ప్రయత్నించేవాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా వాళ్లిద్దరూ కలవడాన్ని ఆపలేకపోయాడు. ఈసారి మళ్లీ అతనికి వారిద్దరిని కలవకుండా ఆపే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఆపగలిగితే ఇక ఎప్పటికీ విజయం తనదే అనుకున్నాడు. సాయంత్రానికి ముందే దహన కార్యం చేయాలని సంకల్పించాడు. ఊరి వారందరూ ఇంకా యశోద రాలేదు.. అని వారించినా వినిపించుకోకుండా అంత్యక్రియలు జరిపించేశాడు. కొంతసేపటికి యశోద బండి దిగింది. ఎటు వారు అటు వెళ్లిపోవడం చూసింది. అక్కడ ఉన్న పాలేరుని "అమ్మ ఎక్కడుంది?" అని పైకి సరిగ్గా రాని మాటలతో అడిగింది.

జరిగిందంతా చెప్పాడు పాలేరు.

అప్పుడు యశోదకు కోపం వచ్చింది. కోపం కాదది.. బాధ. తన తల్లిని కడసారి చూసుకోలేకపోయాను.. అనే బాధ. ఆ బాధతో నేరుగా రాఘవయ్య దగ్గరికి వెళ్లి "ఎందుకిలా చేశావ్?" అని కన్నీళ్లతో అడిగింది. దానికి రాఘవయ్య ఏం మాట్లాడలేదు.

అప్పుడు యశోద "నువ్వు కావాలనే చేశావ్. అమ్మని చివరిసారి చూడకుండా చేసావ్. అమ్మని చివరిసారి ముట్టుకోకుండా చేసావ్. అమ్మ స్పర్శ తగలకుండా చేసావ్. ఆవిడతో నేను చివరిగా చెప్పాలనుకున్నది చెప్పకుండా చేసావ్. ఆవిడకి చివరిసారి కృతజ్ఞత చెప్పకుండా చేసావ్. నా చూపులో ఆమె రూపం నిలిచే చివరి అవకాశం లేకుండా చేసావ్" అని రాఘవయ్య కాలర్ పట్టుకుని ఏడుస్తూ మాట్లాడింది.



రాఘవయ్యకు తన కాలర్ పట్టుకున్నందుకు కోపం ముంచుకొచ్చింది. యశోదను "అసలు ఎవరు నువ్వు? ఎవరికి పుట్టావు? అసలు నువ్వెందుకు మా అమ్మని చివరిసారి చూడాలి? నువ్వు బజార్లో పుట్టిందానివి. వెళ్లి మీ అమ్మ ఎవరో తెలుసుకో, తెలుసుకొని చివరిసారి కాదు జీవితాంతం చూసుకో" అని అనరాని మాటలు అన్నాడు.

ఆ మాటలకు యశోద మనసు విరిగిపోయింది. ఇంకో మాట మాట్లాడకుండా వెనక్కి అడుగులు వేస్తూ వెళ్లిపోయింది.

యశోద వెళ్లిపోతుంటే అందరూ ఆమెనే చూస్తున్నారు. రాఘవయ్య కూడా ఇంట్లోకి వెళ్లిపోయాడు.

కొన్ని నెలలకు రాఘవయ్యకు తప్పు చేశానన్న పశ్చాత్తాపం కలిగింది. చెల్లి చేసిన త్యాగాలను రాఘవయ్య అప్పుడే గుర్తించాడు. మానసిక పరిస్థితి బాగాలేని వాడ్ని తెచ్చి చేసుకో అంటే మరో మాట మాట్లాడకుండా చేసుకుంది. ఆస్తిలో పావు వంతు కూడా ఇవ్వకపోయినా ఊరుకుంది. అలాంటి యశోదకు తల్లి ఆఖరి చూపుని కూడా దూరం చేశాడని, నలుగురిలో బజార్లో పుట్టావు అన్నానని తనలో తాను బాధపడ్డాడు.

తను చేసిన తప్పు తెలుసుకుని క్షమాపణ చెప్పడానికి రాఘవయ్య యశోద ఊరు వెళ్లాడు. కానీ బస్సు దిగలేకపోయాడు. తనలో ఉన్న అహం, తన స్థాయి, తన ప్రతిష్ట "తప్పు చేశాను" అని చెప్పుకోవడానికి, ఒప్పుకోవడానికి ఇష్టపడలేదు. తప్పు చేసినంత సులభం కాదు తప్పు ఒప్పుకోవడం, క్షమాపణ చెప్పడం. రాఘవయ్య తప్పు ఒప్పుకోలేక అదే బస్సులో వెనక్కి వచ్చేసాడు.

ఇంటికి వెళ్లాక ప్రత్యక్షంగా చెప్పలేకపోయినా రాతపూర్వకంగానయినా చెప్పాలని క్షమాపణ కోరుతో ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరానికి ఇప్పుడు ఐదేళ్లు. రాఘవయ్య ఇప్పటికే తప్పు ఒప్పుకోలేకపోతున్నాడు. అలా అని మర్చిపోలేకపోతున్నాడు. కొన్ని రోజులకి రాఘవయ్యకు పట్టణం నుండి కాల్ వచ్చింది, తన కొడుక్కి యాక్సిడెంట్ అయిందని తెలిసింది. రాఘవయ్య కంగారు పడుతూ, భయపడుతూ అతి కష్టం మీద పట్టణం చేరుకున్నాడు. రాఘవయ్య కొడుక్కి పెద్దగా దెబ్బలు తగల్లేదు, బాగానే ఉన్నాడు.

అది చూసి ఊపిరి పీల్చుకుంటాడు రాఘవయ్య. కొడుక్కి ఏమైందోననే క్షోభతో చేసిన ప్రయాణం తలచుకుంటే భయం వేసింది అతనికి. మనవాళ్లకి ఏమైనా అయినప్పుడు వాళ్లని చూడడానికి మనం చేసే ప్రయాణం చాలా దారుణమైనది. బాధ ఒకవైపు, ఏం జరిగిందో అనే భయం మరో వైపు, ఏం జరగకూడదని ప్రార్థన ఇంకో వైపు. "అలాంటి ప్రయాణం ఎంతో దారుణమైంది" అని అనుకున్నాడు రాఘవయ్య.

అప్పుడు రాఘవయ్యకి గుర్తొచ్చింది సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం యశోద కూడా ఇలాంటి ప్రయాణమే చేసిందని. ఆరు గంటలసేపు తల్లి గురించి ఆలోచిస్తూ, బాధపడుతూ ప్రయాణించింది. కానీ తల్లిని చివరిసారిగా చూసుకోలేకపోయింది. ఎంతో క్షోభను అనుభవించింది. యశోద పడిన కష్టాన్ని రాఘవయ్య ఇప్పుడు అర్థం చేసుకున్నాడు. ఇంకేం ఆలోచించకుండా వెంటనే ఉత్తరాన్ని పోస్ట్ చేశాడు. వారం రోజులకు రాఘవయ్యకు తిరిగి ఉత్తరం వచ్చింది. సమాధానం ఉత్తరం వచ్చిందని అనుకున్నాడు. యశోద తన క్షమాపణను అంగీకరించిందో, తిరస్కరించిందో అని ఆలోచిస్తూ ఉత్తరాన్ని తీసుకున్నాడు.

తీరా చూస్తే అది రాఘవయ్య రాసిన ఉత్తరమే. అడ్రసు తప్పు అవడంతో ఉత్తరం వెనక్కి వచ్చింది. అడ్రసు తప్పు అవడం ఏంటో రాఘవయ్యకు అర్థం కాలేదు. ఈసారి ఉత్తరాన్ని తానే స్వయంగా ఇద్దామనుకొని బస్సు ఎక్కాడు. యశోద ఊరు వెళ్లి బస్సు దిగాడు. యశోద ఇంటివరకు నడిచాడు. అక్కడ యశోద ఇల్లు సగం కూలిపోయి ఉంది. పక్కింటి వాళ్లని "ఏమండీ, ఇక్కడ యశోద అని.." అడిగాడు.

"ఆవిడ చనిపోయి మూడు సంవత్సరాలయిందిగా" అని సమాధానం వచ్చింది. రాఘవయ్యకి నోట మాట రాలేదు. యశోద చనిపోయి మూడు సంవత్సరాలయింది. యశోద బతికున్నప్పుడు క్షమాపణ చెప్పలేకపోయాడు. ఇప్పుడు చెప్పే అవకాశం లేదు. జీవితాంతం తప్పు చేశాను.. అనే భారాన్ని మోస్తూ బతకాలి అనుకున్నాడు రాఘవయ్య. తప్పు చేస్తే అది తప్పని తెలిసిన వెంటనే క్షమాపణ కోరడం మంచిది. ఎందుకంటే తర్వాత వారికి ఏదైనా అయితే జీవితాంతం ఆ విచారాన్ని మోయాలి. ఆ ఉత్తరం పట్టుకుని వెనక్కి వచ్చేసాడు రాఘవయ్య.

సీతమ్మని చూడకుండా యశోదని ఆపాలనుకున్నాడు రాఘవయ్య. కానీ ఇప్పుడు సీతమ్మ, యశోదలు ఒకేచోట ఉన్నారు ఎవరూ విడదీయలేని చోట. ✦

బి.నాగలక్ష్మి

# సాహితీశరధి దాశరథి

తెలంగాణ ముద్దుబిడ్డ, పీడిత ప్రజల గొంతుక, నిజాంకు సూటిగా తన ధిక్కార స్వరాన్ని వినిపించి నిజాం నవాబు గుండెల్లో సింహస్వప్నమై నిలిచిన ప్రళయమూర్తి మన దాశరథి. తెలంగాణ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన వారిలో ముఖ్యుడు. నిజాంను ఎదిరించటానికి ఒక్కరు కాదు.. సమాజమంతా శక్తిగా మారాలని తలచి, తన అక్షరాలను ఆయుధంగా మలచి ప్రజల్లో చైతన్యం తెచ్చి అందరినీ ఒక్క తాటిపై నడిపిన మహానాయకుడు దాశరథి.



ఇప్పుడు తెలంగాణ ఆడపడచు సంతోషంగా, బతుకమ్మ పండుగ జరుపుకుంటోందంటే నిజాం పైశాచిక పాలన నుండి విముక్తి చెందటమే అని చెప్పుకోవచ్చు. తెలంగాణ విముక్తి కోసం పోరాడి అమరులైన వారందరికీ స్త్రీ లోకం తరపున ఇదే మా పుష్పాంజలి. తెలంగాణ పోరాటం చేసి, సాధించి, ఆ ఫలాలను స్వీకరించి ప్రజల నూతన జీవితానికి మంచి మార్గం వేసిన దాశరథిని గుర్తు చేసుకుందాం.

దాశరథి కృష్ణమాచార్య జులై 7, 1925లో మహబూబాబాద్ జిల్లా, చిన్న గూడూరు గ్రామంలో వేంకటమ్మ, వేంకటాచార్య దంపతులకు జన్మించాడు. నవంబరు 5, 1987 సంవత్సరంలో స్వర్గస్తుడయ్యాడు. ఇతని బాల్య విద్య ఖమ్మం, మదిరలో, ఇంటర్మీడియట్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో, డిగ్రీ ఇంగ్లీషు సాహిత్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి గావించాడు.

నిజాం నిరంకుశ పాలనలో తెలుగుకు స్థానం లేదు. ప్రజల భాష అయినా గౌరవం లేని కాలం అది. అధికార భాషగా ఉర్దూ ఉండేది. దాశరథి మాతృభాష పట్ల అభిమానం వున్నా, చదువు ఉర్దూ భాషలోనే కొనసాగించవలసి వచ్చింది. ఇతను తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషలలో పాండిత్యాన్ని సంపాదించిన బహుభాషా కోవిదుడు. చిరుప్రాయంలోనే అలవోకగా తెలుగు సాహిత్యంలో పద్యాలు అల్లేవాడు.

దాశరథి చదువు సాగిస్తున్న నూతన యవ్వనంలోనే నాటి నిరంకుశ నిజాం పాలన, ఫ్యూడల్ విధానాల పట్ల వ్యతిరేక భావంతో నవయుగ స్థాపన కోసం కమ్యూనిస్టుగా మారాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో కమ్యూనిస్టు పార్టీ వైఖరి నచ్చక హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో చేరాడు. ఒకవైపు చదువు సాగిస్తూ, ట్యూషన్స్ చెప్పుకుంటూ– మరోవైపు తెలంగాణ విముక్తి కోసం కలం పట్టి 'అగ్నిధారలు' కురిపించాడు. "మా నిజాంరాజు జన్మ జన్మల బూజు' 'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' అని కాళోజీ అన్నట్లే జైలు గోడలపై రాసిన దాశరథి నినాదాలు నిజాం గుండెల్లో వణుకు పుట్టించగా తెలంగాణలో కుల–మత–వర్గ భేదాలు లేకుండా ప్రజలంతా విమోచనోద్యమంలో పాల్గొనేలా ప్రేరణ కలిగించాయి.

ఉద్యమం జోరుగా జరుగుతున్న ఆ సమయంలోనే రజాకార్లు షోయబుల్లాఖాన్‌ను దారుణంగా చంపారు. గాంధీజీ ఇదే సమయంలో గాడ్సే చే హత్య గావించబడ్డాడు. దాశరథిని, ఇతర నాయకులను ఖాసీం రజ్వీ మనుషులు ఇనుపచువ్వలతో హింసించగా దాశరథి ఆ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయారు. ఆ స్థితిలో దాశరథి పాలిటి ఆపద్బాంధవుడు గా వట్టికోట ఆళ్వారుసామి నిలిచిపోయారు.

రజాకార్ల ఆగడాలు, వికృత చేష్టలు, మాన, ధన దోపిడీ పతాక స్థాయిని చేరుకోగా, అంతే ఉధృతంగా ప్రజలంతా ఏకమై ఉద్యమించారు. 17-09-1948 రోజున మన భారత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ పరిస్థితి గమనించి రజాకార్లపై సైనిక చర్య జరిపించి, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడు. జైలులో వున్న ఖైదీలందరినీ విడుదల చేశారు. ప్రజలు దాశరథికి బ్రహ్మరథం పట్టారు. విమోచనానంతరం దాశరథి "నన్ను గన్న నా తెలంగాణ తల్లి–కంజాత వల్లి అని శ్లాఘిస్తూ తను రాసిన 'రుద్రవీణ' ఖండకావ్యాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అంకితమిచ్చాడు. ప్రజలు స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవితం గడిపేలా చేయాలన్న తన ఆశయం నెరవేరింది.

ఇంతటితో ఆగలేదు.. ప్రజలు అనునిత్యం చైతన్యపరులుగా ఉండేందుకు తను అనేక రచనలు చేస్తూ రచనా వ్యాసంగంలో మునిగితేలుతూ, ప్రజల హృదయాలకు చేరువయ్యాడు. ఆంధ్ర మహాసభల్లో చురుకుగా పాల్గొన్నాడు. 'ఆంధ్ర సారస్వత పరిషత్' నిర్మాతల్లో ఒకడయ్యాడు. 1953లో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి, ఎన్నో రచనలను తన కలం నుండి జాలువార్చాడు. 1961లో సినీ రంగ ప్రవేశం చేసి, 'సినీ గీతాల పుస్తకం' తన శ్రీమతి లక్ష్మీదాశరథికి అంకితమిచ్చాడు. సినీ పాటలకు 'కావ్య గౌరవం' తెచ్చిపెట్టింది దాశరథే.

నిజాం నిరంకుశ పాలనపై 'అక్షర శరాలు' సంధించి, ధిక్కార స్వరం వినిపించిన వైతాళికుడు దాశరథి. తెలంగాణ బిడ్డ ఏనాడూ మరచిపోలేని సేవ చేసిన దాశరథికి ఏమిచ్చినా తక్కువే. అతని సాహితీ సేవ, ప్రజాసేవ దృష్టిలో ఉంచుకున్న తెలంగాణ ప్రభుత్వం దాశరథి పేరిట 'దాశరథి అవార్డు' నెలకొల్పింది. సాహిత్యంలో కృషి చేస్తూ ప్రజల్లో జ్ఞానాన్ని నింపుతున్న కవులకు దాశరథి జన్మదినం రోజున జులై 22న, 2015 నుండి దాశరథి అవార్డును ఇవ్వడం ప్రారంభించింది. 2024 దాశరథి జయంతిన 'దాశరథి కృష్ణమాచార్య అవార్డు'ను ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథం ను ఎంపిక చేసారు. దాశరథి జీవితాన్ని, తెలంగాణ విముక్తి కోసం చేసిన కృషిని, తెలుగు భాషకు చేసిన సేవను ఇప్పుడు మనం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అనటంలో అతిశయోక్తి లేదు. తెలంగాణ ఆడపడుచుగా, ఇప్పుడు హాయిగా స్వేచ్ఛా గాలుల్ని పీలుస్తూ దీనికి మూలమైన అమరులందరికీ హృదయపూర్వక పాదాభివందనాలు అర్పిస్తున్నాను.

# ముగ్గురు దొంగలు

యామిజాల జగదీశ్

అతను ధనవంతుడు. ఒకసారి ఓ అడవి మార్గంలో పోతున్నాడు. అతనిని ముగ్గురు దొంగలు చూశారు. అటూ ఇటూ ఎవరూ లేరు. కనుక దొంగలు ఊరుకుంటారా? అదే అనువైన సమయమనుకుని అతనిని చుట్టుముట్టారు. నీ దగ్గర ఏముందో బయటకు తియ్యి, మర్యాదగా ఇచ్చేయి. లేకుంటే జరిగేది వేరు" అని దొంగలు బెదిరించారు.

అయితే ధనవంతుడికి ప్రాణమే గొప్పది. ఉన్నతమైంది. కనుక తన దగ్గరున్నదంతా దొంగలకు ఇచ్చేసాడు.

దొంగలు అతని నుంచి సర్వస్వం తీసుకుని ఇక అక్కడి నుంచి పారిపోవాలనుకున్నారు. అయితే ముగ్గురిలో ఒకడి ఆలోచన వేరేగా ఉంది.

“అతనిని అలాగే విడిచిపెడితే లాభమేమిటీ? చంపేస్తే ఓ పనైపోతుందిగా” అనుకుని తన దగ్గరున్న కత్తి బయటకు తీశాడు.

అతనిని పొడవటానికి సిద్ధపడ్డాడు.

ఇది మరొక దొంగ అది చూశాడు. తన తోటి దొంగకు అడ్డుపడ్డాడు.

“వద్దు.. అతనిని విడిచిపెట్టేద్దాం. తన దగ్గరున్నదంతా ఇచ్చేశాడుగా. అతనిని చంపడం వల్ల మనకేమి లాభం? అతని చేతులు, కాళ్లు కట్టేసి ఇక్కడే ఓ మూల పడేద్దాం” అన్నాడతను.

“ఇదేదో బాగానే ఉందిగా అనుకున్నాడు” చంపేద్దామనుకున్న దొంగ.

ముగ్గురు కలిసి అతని కాళ్లు, చేతులు ఓ తాడుతో కట్టేశారు. ఆ తర్వాత ఓ పక్కన పడేసి వెళ్లిపోయారు.

కొన్ని గంటలు గడిచాయి. మూడో దొంగ మళ్లీ వెనక్కు తిరిగొచ్చి కట్టి పడేసిన ధనికుడిని చూశాడు.

“అయ్యో పాపం.. నీకు నొప్పెడుతోందా?” అని అడిగాడు దొంగ జాలిగా.

“నేను నీ కట్లన్నీ విప్పేస్తాను” అంటూ విప్పేసాడు. “నాతో రా. నీకో దారి చూపిస్తాను” అని తనతో తీసుకుపోయాడు.

“అదిగో చూడు.. అదే నీ ఇల్లు, వెళ్లిపో” అన్నాడు దొంగ.

అప్పుడు ఆ ధనికుడు “అయ్యా, నువ్వు నాకు గొప్ప సహాయం చేశావు, నువ్వూ మా ఇంటికి రా. మా ఇంట్లోని వారందరూ సంతోషిస్తారు” అని చెప్పాడు.

అంతట దొంగ “నువ్వు అడిగితే అడిగావు కానీ నేను నీ ఇంటికి రాలేను. అక్కడికొస్తే పోలీసులు నన్ను పట్టుకుంటారని” చెప్పి అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన కథ ఇది. ఎందుకీ కథ చెప్పారు, ఈ ప్రపంచ జీవితం ఓ అడవి లాంటిది.

ఈ అడవిలో ముగ్గురు దొంగలు



ఉన్నారు.. వారెవరో తెలుసా?

సత్త్వగుణం, రజోగుణం, తమో గుణం. ఈ మూడు గుణాలే ఆ దొంగలు. జీవాత్మ అయి మనిషి అడవి గుండా పోతున్నాడు. అతని దగ్గర ఉన్న వస్తువేంటి? పవిత్రమైన ఆత్మజ్ఞానం. అది చాలా విశిష్టమైన.. విలువైనది.

ఈ మూడింటినీ ఆ ముగ్గురు దొంగలూ దారిదోపిడీ చేస్తున్నారు. తమో గుణమే మొదటి దొంగ. అతనిని చంపేద్దామనుకున్నారు. రజోగుణం మనుషులను పెనవేసుకుంటుంది.

అందువల్ల ఆశలు అధికం అవుతుంటాయి. బంధాలనే సంకెళ్లతో కట్టిపడేస్తుంది. ఈ ముగ్గురు దొంగలూ మనలోనే ఉన్నారు. సత్త్వగుణం ఏం చేస్తుంది. ప్రపంచ బంధాల నుంచి కాపాడుతుంది. అయినప్పటికీ సత్త్వగుణమూ ఓ దొంగే.

అది మనల్ని దేవుడి వద్దకు తీసుకుపోతుంది.

అదిగో చూడు.. నీ ఇల్లు అదిగో, వెళ్లిపో” అని చేతులు చూపించి వెళ్లిపోతుంది.

సత్త్వగుణం మేలైనది.

అయినప్పటికీ అంతకన్నా గొప్పది మరొకటి ఉంది. అదేమిటంటే– దేవుడిగా మార్చేస్తే జ్ఞాని స్థితి. మూడు గుణాలు దాటితేనే ఒకడు బ్రహ్మ, జ్ఞానానికి చేరుకోగలడు అన్నది రామకృష్ణ పరమహంస అభిప్రాయం.

ఇదంతా చూస్తే నాకో కథ జ్ఞాపకానికి వచ్చింది. ఓ ధనవంతుడు ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. అతని భార్య గుడికి వెళ్లింది.

ఆ సమయంలో ముగ్గురు దొంగలు వచ్చారు. కత్తులతో బెదిరించి నగా నట్రా అన్నీ దోచుకున్నారు.

అతనిని తాడుతో కట్టలేదు. కానీ ఈయనే చేతులెత్తి వారికి దండం పెట్టి “అయ్యా, మీరు దోచుకున్నందుకు నేనేమీ బాధపడటం లేదు. కానీ నా దిగులంతా ఒక్కటే, మీరు ఓ పని చెయ్యాలి” అన్నాడు.

“అదేమిటో చెప్పమని” అడిగారు దొంగలు.

“నన్ను కుర్చీలో కూర్చోపెట్టి తాళ్లతో కట్టేసెయ్యండి. నోట్లో గుడ్డ కుక్కి వెళ్లిపోండి” అని చెప్పాడు ధనికుడు.

దొంగలకు ఆశ్చర్యం వేసింది అతనెందుకు అలా చెప్తున్నాడో వారికి అర్థం కాలేదు.

అప్పుడు ఆ ధనికుడు “మీరు నన్ను కట్టకుండా వెళ్లిపోతే ఈ నగా నట్రా అంతా నేనే దొంగిలించేసానని నా భార్య నన్ను అనుమానిస్తుంది. అందుకే నన్ను కట్టేసి పోండి” అన్నాడు.

# కళ్యాణ క్షేత్రం 'వల్లిమలై'

ఇలపావులూరి వెంకటేశ్వర్లు



**ఆది దంపతుల ప్రియపుత్రుడు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు తమిళనాడులో ఎక్కువగా కనిపిస్తాయి. ప్రతి ఒక్క క్షేత్రం తనదైన పౌరాణిక గాథ, చారిత్రక విశేషాలు కలిగి ఉంటుంది. దేశంలో మరెక్కడా లేని విధంగా శ్రీ కుమారస్వామి విశ్రాంతి తీసుకొన్న ఆరు పడై వీడు క్షేత్రాలను విశేషంగా చెప్పుకోవచ్చు.**

వాటితో సంబంధం కలిగివుండి, శ్రీ షణ్ముఖ కళ్యాణంతో ముడిపడి ఉన్న ఒక క్షేత్రం తమిళనాడులోని వెల్లూరు పట్టణానికి సమీపంలో ఉంది.

## వల్లిమలై

మయూర వాహనుని ఇద్దరు భార్యలలో ఒకరైన వల్లీదేవి జన్మస్థానంగా పేర్కొంటారు. వల్లీదేవి ఈ ప్రాంత అడవికి రాజు అయిన నంబి రాజుకు పసిబిడ్డగా లభించిందట. అతను ఆమెకు వల్లీ అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకొన్నాడు.

యుక్తవయస్సుకు వచ్చిన వల్లీకి వివాహం చేయ సంకల్పించారు తల్లితండ్రులు. ఆ సమయంలో నారద మహర్షి వచ్చి వారికి వల్లీదేవి జన్మవృత్తాంతం చెప్పారని ప్రతీతి.

## వల్లీదేవి జన్మ వృత్తాంతం

ఒకసారి శ్రీ మహావిష్ణువు వృద్ధుని రూపంలో చేస్తున్న తపస్సును భగ్నం చేయడానికి శ్రీ మహాలక్ష్మి మనోహరమైన నాట్యం చేసిందట. ఆ సమయంలో ఆమె శరీరం నుండి ఒక స్వేద బిందువు ఈ ప్రాంతంలోని గడ్డి పరకల మీద పడిందట. ఒక ఆడ జింక గడ్డితో పాటుగా ఆ బిందువును కూడా తీసుకొన్నదట.

ఆ కారణంగా కొంత కాలానికి జింక చక్కని ఆడపిల్లకు జన్మనిచ్చింది. మరో సంగతి ఏమిటంటే గత జన్మలో ఈ బాలిక తన సోదరితో కలిసి ఈ ప్రాంతంలో శ్రీ లక్ష్మీనారాయణుల అనుగ్రహం కోరి తపస్సు చేసారట. వారు ఆయనను తమకు శివపుత్రుడైన శ్రీ కార్తికేయునితో కళ్యాణం జరిగేలా వరం కోరుకున్నారు.

లక్ష్మీనారాయణులు వచ్చే జన్మలో అది సాధ్యపడుతుంది. అప్పుడు ఒకరు దేవేంద్రుని కుమార్తె దేవసేనగా, మరొకరు వల్లీదేవిగా జన్మిస్తారు.. అని వరం అనుగ్రహించారట.

అందువల్ల ఈ బాలిక శివపార్వతుల కుమారుడైన దేవసేనానికే చెందుతుంది.

విషయం చెప్పిన నారదమహర్షి కైలాసానికి వెళ్లి శ్రీ కుమారస్వామికి వల్లీదేవి గురించి తెలిపారట. బాలిక గుణగణాలు, సౌందర్య వివరాలు విన్న శరవణుడు వల్లిమలై వచ్చారట. వల్లీదేవిని ఆకర్షించడానికి అనేక విఫల ప్రయత్నాలు చేశారట. చివరకు సోదరుడు గణపతి సహకారం కోరారు. గణపతి ఏనుగు రూపంలో వచ్చి వల్లీదేవిని భయపెట్టారట. ఆమె వేటగాడి రూపంలో ఉన్న మురుగన్‌తో ఏనుగు బారి నుండి కాపాడితే వివాహమాడతాను అన్నదట. వారి కళ్యాణం జరిగింది. అలా వల్లిమలై కళ్యాణ క్షేత్రంగా పేరొందింది.



## క్షేత్ర విశేషాలు

వల్లిమలైలో కొండ కింద ఒక ఆలయం ఉండగా పైన ఒక గుహాలయం ఉంటాయి.

పచ్చని కొండలు, పల్లె వాతావరణం, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదం కలిగించే ప్రదేశంలో నెలకొని ఉంటుంది శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వల్లిమలైలో.


కొండ కింద ఉన్న ఆలయంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ గణపతి దర్శనమిస్తారు.

కొండ మీదకు వెళ్లడానికి మార్గాలు ఉన్నాయి. ఆలయం లోపలి నుండి నాలుగు వందల మెట్ల మార్గం ఉన్నది. దీనిని అనంతర కాలంలో నిర్మించారు. మరోపక్క నుండి పురాతన మార్గం ఉన్నాయి. పురాతన మార్గంలో మెట్లు సరిగ్గా ఉండవు. ఇక్కడ చూడాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి.

## జైన గుహాలు

ఒకప్పుడు వల్లిమలై జైన తీర్థంకరుల నివాసం. పాత మార్గంలో పైకి వెళుతున్నప్పుడు పదవ శతాబ్ద కాలంనాటి గుహాలు కనిపిస్తాయి. ప్రస్తుతం పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉన్న ఈ గుహాలు పడమటి చాళుక్యుల కాలంలో నిర్మించినవి అని శాసనాధారాలు తెలుపుతున్నాయి. ప్రకృతి సిద్ధంగా రాళ్లతో ఏర్పడినవి.

రెండు గదుల వైశాల్యంలో ఉన్న ఈ గుహాల పైభాగంలో తీర్థంకరుల శిల్పాలు చెక్కబడి కనబడతాయి.



పైనున్న కోనేరుల తాలూకు నీరు ఈ గుహల మీదుగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి.

## ఎగువ ఆలయం

జైన గుహల నుండి ఎగుడు దిగుడు దారిలో ఉన్న మెట్ల మీదగా పైకి వెళుతుంటే కొండల మధ్య తామర పూవులతో నిండిన స్వతఃసిద్ధ జలాశయం కనపడుతుంది.

కుమారి తీర్థం అని పిలవబడే ఈ కోనేరుకు ఆ పక్కన పురాతన రాతి మండపం ఉంటుంది. వల్లీదేవి ఈ మండపంలో స్నానానికి ముందు పసుపుకొమ్ములను దంచేదని చెబుతారు.

కొద్దిగా ముందుకు వెళితే కొండ పైభాగానికి చేరుకొంటాం. ఒక దారి ప్రధాన ఆలయానికి వెళుతుంది. మరొక దారి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుప్పుగళ్ ఆశ్రమానికి వెళుతుంది.

ఈ తిరుప్పుగళ్ ఆశ్రమం శ్రీ తిరుప్పుగళ్ శ్రీ సచ్చిదానంద స్వామీజీ స్థాపించారు. సుబ్రహ్మణ్య స్వామి గొప్ప ఆరాధకులు. కవి శ్రీ అరుణగిరి నాథర్ రచించిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కీర్తనల సంకలనం అయిన "తిరుప్పుగల్"ను భక్తజన కూటముల లోపలికి తీసుకొని వెళ్లారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునర్నిర్మించారని చెబుతారు. ఆయన జీవ సమాధి ఆశ్రమం పక్కనే ఉంటుంది.

ఆశ్రమానికి వెళ్లే దారిలో వల్లీదేవి గత జన్మలో శ్రీ మహావిష్ణువు గురించి తపస్సు చేసిన ప్రదేశం వస్తుంది. ఈ ఆశ్రమంలో శ్రీ వల్లీదేవి "పొంగి" అన్న పేరుతో కొలువై ఉంటారు.

ఇక్కడికి దగ్గరలో ఏనుగు ఆకారంలో ఉన్న కొండరాళ్లు కనిపిస్తాయి. స్వామి వివాహానికి గణపతి గజరూపంలో వచ్చి సహాయం చేసారని ఐతిహ్యం. దీనిని గణేశ మలై అని పిలుస్తారు. ఇక్కడికి సమీపంలో మరో పెద్ద రాతి గుట్ట మీద నిర్మించిన ఆలయంలో కైలాసనాథుడు శ్రీ తిరుమల గిరీశ్వర స్వామి అన్న పేరుతో కొలువై దర్శనం ఇస్తారు.

ప్రస్తుతం శిష్యులు ఆశ్రమ నిర్వహణ చూస్తున్నారు. చుట్టూ పర్వతాలు, మధ్యలో చిన్న చిన్న పల్లెలు, పచ్చటి పంట పొలాలతో కనువిందుగా విందుగా వాతావరణం. కొన్ని పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య సహజసిద్ధంగా ఏర్పడిన గుహాలయాన్ని పల్లవరాజులు నిర్మించారు. అత్యధిక శాతం గుహాలయాలు పల్లవులు నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడ విమాన



గోపురాన్ని రెండు రాళ్ల మీద నిర్మించారు.

వెలుపల ఎత్తైన ధ్వజస్థంభం వద్ద శ్రీ వరసిద్ధి వినాయకుడు, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి నవ సేనాధిపతులు కొలువై ఉంటారు. ఆలయానికి వెళ్లే దారిలో వల్లీదేవి వడిశెల ఒక చేతిలో, మరో చేతిలో రాయి పుచ్చుకొని పంటల మీద వాలే పక్షులను తోలివేసే భంగిమలో కనిపిస్తారు.

విశాలమైన గుహాలయంలో శ్రీ వల్లీ దేవసేల సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ భంగిమలో దర్శనం ఇస్తారు.

శ్రీ అరుణగిరినాథర్ ఆదిగా గల వారి సన్నిధులు కూడా ఇక్కడ ఉంటాయి. గుహ లోపల పెద్ద బిలం కనిపిస్తుంది. అది నేరుగా పళని ఆలయానికి వెళుతుందని చెబుతారు.

## ఆలయ పూజలు-ఉత్సవాలు

ప్రతిరోజూ నియమంగా పూజలు చేస్తారు. హిందూ విశేష, పర్వదినాలలో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయానికి తరలి వస్తుంటారు. ముఖ్యంగా మంగళవారాలు, అమావాస్య, పౌర్ణమి, షష్ఠి తిథులలో, సెలవు దినాలలో అధిక సంఖ్యలో భక్తులు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుండి వస్తుంటారు.

ప్రతి నెల ఒక ఉత్సవం జరిగే క్షేత్రంలో మాసి(మాఘం) మాసంలో పది రోజుల బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ వల్లీ సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణం జరుగుతుంది. రథోత్సవం, తెప్పోత్సవం.. ఇలా మరెన్నో ఉత్సవాలు ఏర్పాటు చేస్తారు. కార్తిక మాసంలో విశేష పూజలు జరుగుతాయి.

ఆశ్వయుజ మాసంలో స్కందషష్ఠి తరువాత శ్రీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ముత్తైదువులకు తిరుప్పుగళ్ ఆశ్రమంవారు పవిత్ర పసుపు-కుంకుమ అందిస్తారు.

వెల్లూరుకు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న వల్లిమలైకి బస్సు సౌకర్యం లభిస్తుంది. ఆలయం వద్ద తగుమాత్రపు వసతి, భోజన సదుపాయాలు లభిస్తాయి. పర్వదినాలలో అయితే ఇబ్బందులు ఉండవు. అయితే మిగతా రోజులలో వెల్లూరు నుండి వెళ్లి రావడం ఉత్తమం.

కస్తూరి మురళీకృష్ణ




# ద్రోహబుద్ధి మంచిది కాదు

(గత వారం తరువాయి..)

**పరిచారిక వచ్చి శ్యామ దగ్గర నిలుచుంది. "ఇదిగో ఈ ధనం తీసుకుని అదిగో ఆ చోరుడిని పట్టుకుని వెళ్తున్న రక్షక భటాధికారి దగ్గరకు వెళ్లు. ఇతడు శ్యామ సోదరుడు. ఈ ధనం తీసుకుని అతడిని విడిచి పెట్టండి" అని చెప్పు. ధనం ఇవ్వు. ఆ దొంగను తీసుకుని రా" అని పంపించింది.**

అలాగే రక్షక భటాధికారి దగ్గరకు వెళ్లి శ్యామ చెప్పమన్నట్టే చెప్పింది.

ఆమె మాటలు ఓపికగా విన్నాడు రక్షక భటాధికారి. కానీ ధనం తీసుకొనేందుకుగానీ, దొంగను విడిచిపెట్టేందుకుగానీ ఒప్పుకోలేదు.

"ఇతడు గొప్ప దొంగ. ఇతడిని పట్టుకోవటం కోసం రాత్రింబవళ్లు గాలించాం. ఇతడిని వదిలే వీలులేదు. ఇతడి వంతుకు వేరే ఎవరైనా దొంగతనం చేసినట్టు ఒప్పుకుంటే, ఇతడి స్థానంలో అతడిని ఉంచి ఇతడిని విడిచేస్తాం" అని చెప్పాడు.

ఎంతగా బతిమిలాడినా దొంగను విడిచిపెట్టేందుకు అధికారి ఒప్పుకోకపోవటంతో సేవకురాలు వెనుదిరిగి వచ్చేసింది.

విషయం యజమానురాలికి చెప్పింది.

విషయం విని ఆమె యజమానురాలు తల ఆడించింది.

ఆమె దగ్గరకు శ్రేష్ఠిపుత్రుడు రోజూ వస్తాడు. సాయంత్రంపూట వేయి నాణేలు పట్టుకుని వస్తాడు. ఆ వేయి నాణేలు ఆమెకి అందచేశాడు.

ఆమె ఆ వేయి నాణేలు ఒళ్లో పెట్టుకుని ఏడవటం ఆరంభించింది.

"ఎందుకు ఏడుస్తున్నావు?" అనునయంగా అడిగాడు.

"ఇవాళ పొద్దున్న రక్షక భటాధికారి పట్టుకున్నది నా సోదరుడిని. నేను వెళ్లగా నచ్చక నా దగ్గరకు రాదు. కానీ వెయ్యి నాణేల ధనం ఇస్తే అతడిని విడిచి పెడతానని రక్షక భటాధికారి నాకు సమాచారం పంపించాడు.

ఈ డబ్బు తీసుకువెళ్లి అతనికి ఇచ్చేవారు లేరు. నా సేవకురాలు వెళ్లిపోయింది" అని ఏడవటం మొదలు



పెట్టింది.

అది చూసి అతను కరిగిపోయాడు.

"నేను వెళ్తాను" అని లేచాడు.

"ఈ సంచీ తీసుకువెళ్లు" అని ధనం ఉన్న సంచి అందించింది.

అది తీసుకుని అతడు రక్షక భటాధికారి దగ్గరకు వెళ్లాడు. ధనం అందించాడు.

రక్షక భటాధికారి అతడిని రహస్య ప్రదేశంలో ఉంచాడు. "ఈ దొంగ పేరు దేశమంతా మారుమోగింది. కాబట్టి చీకటి పడని" అన్నాడు.

ధనం తీసుకుని చీకటి పడగానే దొంగను వదిలేశాడు.

శ్రేష్ఠిపుత్రుడి కాళ్లు, చేతులు బంధించాడు. అతడేదో చెప్పేలోగా నోరు మూసేశాడు. తలను శరీరం నుంచి వేరు చేశాడు.

ఆ తలను శూలానికి గుచ్చి నగరంలో ఊరేగింపు చేశాడు.

దొంగ శ్యామ ఇంటికి చేరాడు.

అతడే లోకంగా జీవించటం ఆరంభించాడు.

ఆమె సంపూర్ణంగా అతడినే లోకంగా భావించింది.

కానీ దొంగకు మాత్రం ఆమె పట్ల ఎన్నడూ విశ్వాసం కలగలేదు.

"నా కోసం ఒకడిని చంపించింది. ఈమె వేశ్య. రేపు ఇంకొకడు నచ్చితే వాడికోసం నన్ను చంపించవచ్చు. ఈమెది ద్రోహబుద్ధి. కాబట్టి ఇవాళ కాకపోతే రేపయినా నా మీద మోజు తగ్గిపోతుంది. అప్పుడు నాకు ప్రమాదం. కాబట్టి ఎక్కువ కాలం ఇక్కడ ఉండటం మంచిది కాదు. త్వరలో పారిపోవటం ఉత్తమం. ఉట్టి చేతులతో పారిపోయే బదులు ఈమె దగ్గర ఉన్న నగలన్నీ ఎత్తుకుపోవాలి" అనుకున్నాడు.

అనుకున్న ప్రకారం ఒకరోజు శ్యామతో అన్నాడు.

"ఎన్ని రోజులని మనం బయటకు కదలకుండా బందీల్లా ఇంట్లోనే కూర్చుంటాం. కారాగారంలో ఉన్నట్టే ఉంది నాకు. కొద్దిసేపు వనవిహారం చేద్దాం. నువ్వు స్వర్ణాభరణ భూషిత అయి రా. వినీలాకాశం కింద, పచ్చని చెట్ల నడుమ సర్వాలంకార భూషిత అయిన నిన్ను చూస్తూ మైమరచిపోతాను" అన్నాడు.

ఆమె అతని మాటలు నమ్మింది. ఉన్న నగలన్నీ అలంకరించుకుని అతనితో ఉద్యానవనానికి వెళ్లింది.

అతడు ఆమెతో మాట్లాడుతూ, ఆడుతూ సమయం గడిపాడు, ఆమెను వదిలి పారిపోయేందుకు అనువైన సమయం కోసం ఎదురు చూస్తూ.

ఎవరూ తమని గమనించటం లేదని నిర్ధారణ చేసుకుని, ఆడుతున్నట్టు చేసి దగ్గరలో ఉన్న ఓ గన్నేరు పొదలో దాక్కున్నాడు.

అతడిని వెదుకుతూ ఆమె కూడా గన్నేరు పొదలో ప్రవేశించింది.

అందుకోసమే ఎదురు చూస్తున్న అతడు ఆమెకు మత్తుమందు వాసన చూపించాడు.

ఆమె వివశ అయిపోయింది.

ఆమెను పొదలోనే పారవేసి, ఆమె ఒంటి మీద ఉన్న ఆభరణాలన్నీ ఆమె ఓణీలోనే మూట కట్టాడు. సరైన సమయం చూసి, ఉద్యానవనం గోడ దూకి పారిపోయాడు.



తెలివి వచ్చిన తరువాత ఆమె తన పరిచారికలను అడిగింది...

"అతడెక్కడ?"

"మాకు తెలియదు" అన్నారు వారు.

ఆమెకు దుఃఖం ఆగలేదు.

అప్పుడు కూడా ఆమె దొంగను శంకించలేదు.

"నేను వివశనై పడిపోగానే అతడు నేను చచ్చిపోయానని అనుకుని ఉంటాడు. ఆ నేరం తనపైకి వస్తుందేమోనన్న భయంతో పారిపోయి ఉంటాడు" అనుకుంది.

"అతడు తిరిగి వచ్చేదాకా నేను నేల పైనే పడుకుంటాను" అనుకుంది.

మంచం వదలి నేలపైనే పడుకుంది.

అతను వచ్చేవరకూ ఆమె మంచి బట్టలు కట్టుకోకూడదనుకుంది. మంచి బట్టలు కట్టటం మానేసింది. భోజనం ఒక పూటనే తినటం ఆరంభించింది. అలంకరణలు చేసుకోవటం వదిలేసింది. గంధలేపనం వాటిని విసర్జించింది. అతడిని తిరిగి ఎలా తన దగ్గరకు రప్పించేందుకు వీలవుతుందని ఆలోచించింది.

చివరికి ఆమె పాటలు పాడి నృత్యం చేసేవారిని పిలిచింది.

వారికి ధనం ఇచ్చింది.

"మేమేం చేయాలి?" అడిగారు వారు ధనం స్వీకరిస్తూ.

"మీకు నేనొక పాట నేర్పుతాను. మీరు దేశమంతా ఈ పాట పాడుతూ తిరగాలి. నగరం, పల్లె అని లేదు. దేశం నలుమూలలా తిరగండి. మీరీ పాటలు పాడే సమయంలో ప్రజలు గుమిగూడుతారు. ఆ గుమిగూడిన వారిలో అతడుంటే అతడు మీతో మాట్లాడుతాడు. అప్పుడు అతడికోసం నేను ఎదురు చూస్తూ ఎలా అనారోగ్యంతో అతడు లేని వేదన వల్ల బాధపడుతున్నానో చెప్పండి. అతడిని మీ వెంట తీసుకుని రండి. అతడు మీ వెంట రాకపోతే నాకు కబురు పెట్టండి" అంది.

వారు "సరే" నన్నారు.

వారణాసి నుండి బయలుదేరారు.

ఎక్కడకు వెళ్లినా ముందు నృత్యంతో అందరినీ ఆకర్షించేవారు. ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడగానే ఆమె నేర్పిన పాట పాడేవారు.

ఎవరూ వచ్చి కలవకపోతే, మరో వీధిలో, మరో చూడలిలోనో మళ్లీ అదే పద్ధతిని అవలంబించేవారు.

అలా తిరుగుతూ దేశ సరిహద్దులోని ఓ గ్రామంలో పాట పాడారు.

అప్పుడు ప్రేక్షకులలోంచి ఒకడు వారి పాటకు సమాధానంగా పాడేడు.

"ఆమె చనిపోలేదని నేను నమ్మను. ఆమె బతికి ఉందని అనుకోను" అని.

దానికి సమాధానంగా వారు "ఆమె బతికే వుంది. తన మనస్సును హరించిన చోరుడి ధ్యాసలో రాత్రింబవళ్లు వేదనతో గడుపుతోంది" అన్నారు.

"నేను నమ్మను" అన్నాడతడు.

ఎక్కడ తనను బంధిస్తారోనని అక్కడి నుండి పారిపోయాడు.

ఈ విషయం వారు శ్యామకు చెప్పారు.

సంగతి తెలిసి తాను ఎంతగా మోసపోయిందో గ్రహించింది శ్యామ.

నిజం గ్రహించిన తరువాత ఆమె మళ్లీ గతంలోగా జీవించటం ప్రారంభించింది.

...........

కథను పూర్తి చేస్తూ చెప్పాడు శాస్త.

"ఆ కాలంలో తన ప్రేయసి కోసం శిరచ్ఛేదన శిక్ష అనుభవించింది ఈ భిక్షువు. ఆ దొంగను నేనే".

...........

అది శాస్త కోశాంబిలో బదరికా వనంలో విహరిస్తున్న కాలం.

ఆ కాలంలో ఒకరోజు బౌద్ధ భిక్షువులంతా రాహుల స్థవిరుడి క్రమశిక్షణను పొగడటం శాస్త విన్నాడు.

వారితో సంభాషణలో శాస్త రాహులుడి క్రమశిక్షణను స్వయంగా మెచ్చుకున్నారు. "భిక్షువులారా, రాహులుడు ఇప్పుడే కాదు, గతంలో కూడా క్రమశిక్షణను పాటించాడు. క్రమశిక్షణ వల్ల అనేక దుష్కర్మల నుండి తప్పించుకున్నవాడు. తద్వారా ఉపదేశం పొందినవాడు" అన్నాడు.

భిక్షువులందరికీ ఆ పూర్వ జన్మ గాథ వినాలన్న కుతూహలం కలిగింది.

"ఆ గాథ చెప్పమని" వారు శాస్తను అభ్యర్థించారు.

మందహాసంతో వారి అభ్యర్థనను ఆమోదించాడు శాస్త.

వారికి రాహుల స్థవిరుడి పూర్వ గాథ చెప్పటం ప్రారంభించాడు.

## సరదా రచనలకు ఆహ్వానం

***జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.***

*sunmagvaartha@gmail.com*

# ఇంటర్వ్యూలో నెగ్గాలంటే?


**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458


(గత వారం తరువాయి..)

గురువారం బృహస్పతి వారం. బృహస్పతికి అనుకూలమైనది పసుపు రంగు. మీరు ఆరోజు పని మీద వెళ్లేటప్పుడు పసుపు రంగు షర్ట్ వేసుకోండి. అయితే 'పసుపు రంగు, తెలుపు రంగు' ఈ రెండింటి కాంబినేషన్ వేసుకోకూడదు. వేసుకుంటే మొత్తం పసుపు వేసుకోవాలి. లేదా వైట్ ప్యాంట్ కాకుండా ఇంకేదైనా కలర్ ప్యాంటు వేసుకొని పైన పసుపు చొక్కా వేసుకోవచ్చు. ఇంకా పసుపు రంగు స్వీట్ ఏదైనా ఒక లడ్డు లేదా జామపండు(పసుపు రంగులో ఉంటుంది) ఇట్లాంటిది ఒకటి కానీ కొంచెంగానీ తిని బయలుదేరండి....సరిపోతుంది.

శుక్రవారం వారానికి అధిపతి శుక్రుడు. ఆయన అనుకూల వర్ణం తెలుపు. తెలుపు రంగు వస్త్రాలు ధరించడం అన్ని విధాలా మంచిది. వైట్ ప్యాంట్, వైట్ షర్ట్ వేసుకోవచ్చు. తమ జాతకాలలో శుక్ర మహర్దశ నడుస్తున్నప్పుడు చాలామంది ఈ తెలుపు వస్త్రధారణకి ప్రాధాన్యతని ఇస్తారు. చివరకు ధరించే చెప్పులు, షూస్, సాక్స్ కూడా తెలుపు రంగులో ధరిస్తుంటారు.

ఇవన్నీ కూడా అద్భుతమైన ఫలితాలు ఇస్తాయి. ముఖ్యమైన పని మీద ఆరోజు బయటికి వెళ్లే ముందు ఒక తెలుపు రంగు స్వీట్ తినండి. తెలుపు రంగు పండు కూడా తినొచ్చు.

శనివారం శనీశ్వరుడికి సంబంధించినది. ఆయన అనుకూల వర్ణం నలుపు. ఆరోజు మీరు ఏదైనా ముఖ్యమైన పని మీద బయలుదేరి వెళ్లేముందు నలుపు రంగు లేదా ముదురు నీలం రంగు.. ఈ రెండు రంగుల వస్త్రధారణ పనికొస్తుంది. తెలుపు రంగు వస్త్రధారణ కూడా చేయవచ్చు. నలుపు రంగుకు దగ్గరగా ఉన్న వస్త్రధారణ కూడా చేయవచ్చు. ఉదాహరణకి బూడిద రంగు



వస్త్రాలు, నలుపు రంగు శనివారంనాడు బయటికి వెళ్లేటప్పుడు సాధారణంగా షూస్, చెప్పులు.. ఇవి బ్లూ కలర్‌లో ఉంటే మరీ మంచిది. డ్రెస్సింగ్ గురించి వేరే ఆలోచన అవసరం లేదు. అలాగని బ్లాక్ ప్యాంటు, బ్లాక్ షర్ట్ వేసుకోమని చెప్పటం లేదు. జేబులో నలుపు రంగు పెన్నుగానీ, నలుపు రంగు కర్చీఫ్‌గానీ పెట్టుకోండి. ఇది సరిపోతుంది. నలుపు రంగు స్వీట్ కానీ నలుపు రంగులో వుండే ఏదైనా ఫ్రూట్‌గానీ కొంచెం తిని బయలుదేరండి. ఇవన్నీ అద్భుతమైన ఫలితాలని ఇస్తాయి.

ఆదివారం సూర్యుడికి సంబంధించింది. సూర్యునికి అనుకూలమైన రంగు తామర వర్ణం. అంటే లేక ఎరుపు రంగు. వస్త్రధారణలో ఈ రంగు ఉండేలా చూసుకోవాలి. ఆ రోజు పని మీద బయలుదేరే ముందు ఎరుపు రంగుకు దగ్గరగా ఉండే వర్ణం కలిగిన ఏదైనా ఒక స్వీట్ లేదా ఏదైనా ఒక పండు తింటే మంచిది. వీలైతే ఎరుపు రంగు చేతిరుమాలు దగ్గర పెట్టుకొని వెళ్లొచ్చు.

వారం రోజుల్లో ఏ వారంనాడు మీకు ముఖ్యమైన పని ఉన్నదో ఆ వారం ఈ విధమైన నియమాలు పాటించడం వల్ల మీ పనుల్లో సక్సెస్ రేటు చాలా పెరుగుతుంది.

అయితే ఒక ముఖ్యమైన విషయం కూడా గుర్తు పెట్టుకోవాలి. ఒక సక్సెస్ కోసం కేవలం ఇలాంటి వాటి మీదనే ఆధారపడి ఉండకుండా మీ వంతు కృషి కూడా మీరు చేయవలసిందే. ఒక్కొక్కప్పుడు కొన్ని విజయాల వలన ఉపయోగం కూడా ఉండదు.

ఎలాగంటే- మీరు ఒక వ్యవహారం మీద, లేకపోతే ఒక ఇంటర్వ్యూకు వెళ్లారనుకోండి. అది సక్సెస్ అయి, మీరు అందులో చేరినా, మీకు ఏమీ ఉపయోగం కలగలేదనుకోండి. అందులో చేరి కేవలం కొన్ని రోజులు పని చేసిన తర్వాత, ఏ కారణం చేతనైనా మళ్లీ మానేయవలసి వస్తే.. ఇదంతా కూడా వేస్ట్ ఆఫ్ టైమ్ కదా!

ఇటువంటివి ఏవైనా పనికిరానివి అయితే అవి కూడా తప్పించబడతాయి. అంటే మీరు వెళ్లే ఇంటర్వ్యూ కానీ, చేసే వ్యవహారం కానీ మంచి ఫలితాలను ఇవ్వనిది అయితే అది తప్పించబడుతుంది.

అటువంటి సందర్భాలలో 'మీరు తీసుకున్న జాగ్రత్తలు అన్నీ వృథా అయ్యాయి' అనుకోకండి. అది మీకు 'దొరకకపోవడమే మంచిది అయింది' అని తర్వాత తెలుస్తుంది.

పైన సూచించిన టిప్స్ పాటించండి. సమయాన్ని, ధనాన్ని ఎంతో ఆదా చేసుకున్నవాళ్లు అవుతారు. సౌకర్యవంతమైన జీవితాన్ని కోరుకున్న వాళ్లకు జీవితంలో అంతకంటే ఇంకా ఏం కావాలి! విజయోస్తు!!

వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు.................................................................

పుట్టినతేదీ : ........................ ఊరు : ..................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: .......................

చిరునామా: ......................................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు మేరకు కొన్ని నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ప్రయోజనకరమైన అంశాలను గ్రహిస్తారు. మహా పాశుపత కంకణం ధరించండి. ఉద్యోగం లభిస్తుంది. బంధుమిత్రులతో చర్చలు, సమావేశాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ఏదో ఒక విషయంలో మీ మాట దాటేవాళ్లు ఎక్కువగా ఉంటారు.

## వృషభం



పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, వైద్య, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి, పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహాలుగా మారతాయి. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. నూతన వ్యాపార ఒప్పందాలు కలిసి వస్తాయి.

## మిథునం



కొన్ని కార్యక్రమాల నిమిత్తం మీ పలుకుబడిని ఉపయోగిస్తారు. ఆ ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారం మొదలు పెడతారు. రాత పూర్వకమైన పత్రాల పట్ల కచ్చితమైన శ్రద్ధ చూపించండి. మెడలో కాలభైరవ రూపు ధరించండి. వ్యాపారంలో చేసే మార్పులు అనూహ్యంగా కలిసి వస్తాయి. వత్తిడిని భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

## కర్కాటం



భాగస్వామ్య వ్యాపారంలో చేసే మార్పులు కలిసి వస్తాయి. క్రీడా రంగంలోని వారికి అనుకూలంగా ఉంది. స్వల్ప అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కళా, సాహిత్య కారుల ప్రతిభా పాటవాలకు పేరు ప్రఖ్యాతులు, అవకాశాలు లభిస్తాయి. సన్మాన యోగం. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.ఉద్యోగంలో మార్పులు ఏర్పడతాయి.

## సింహం



కొంత మంది వ్యక్తుల ప్రవర్తన బాధకి, భావోద్వేగాలకి కారణమవుతుంది. స్నేహితుల సహాయం, సహ ఉద్యోగుల సహాయం కొంతమేరకు ఉపయోగపడుతుంది. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కీళ్లనొప్పులు, నేత్ర వ్యాధులతో అవస్థ పడే అవకాశాలున్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యాల్లో పాల్గొంటారు. చర్చలు ఫలిస్తాయి.

## కన్య



కుటుంబంలో కఠినమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు ఏర్పడతాయి. కొంతమంది వ్యక్తుల ప్రభావం, వారి ప్రవర్తన నచ్చక కొన్ని నిర్ణయాలు వెంటనే తీసుకుంటారు. పక్షులకి నీటి వసతి కల్పించడం మంచిది. ఇంట్లో, ప్రవేశ ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి.

## తుల



శుభ కార్యాది విషయ వ్యవహారాలు ఇంట్లో ప్రస్తావిస్తారు. దీనికి వెంటనే మీ అభిప్రాయాన్ని తెలియ జేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కుక్కలకి చపాతీలు తినిపించండి. పక్షులకి నీళ్లు పెట్టండి. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. వృత్తిరీత్యా కార్యాలయంలో అదనపు బరువు బాధ్యతలు ఏర్పడతాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.

## వృశ్చికం



కాపురంలో చిచ్చు పెట్టేవారిని గుర్తిస్తారు. వీరి పట్ల మీ ప్రవర్తన మారుతుంది. ఇలాంటి వాళ్లకి అవకాశం, ఆశ్రయం ఇవ్వకూడదని నిర్ణయం తీసుకుంటారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. రుణ బాధల నుండి బయట పడడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తారు. కొన్ని సందర్భాలలో చేతిలో ఉన్న ఆస్తిని అమ్మి ఈ బాధల నుండి బయట పడాలని ఆలోచన చేస్తారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి.

## ధనుస్సు



కొంత మందికి మీ సలహాలు, సూచనలు ఇచ్చి వాళ్ల ద్వారా పనులు చేయించుకోవాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. మీకు ఉన్న ధైర్యం, స్ఫూర్తి మీ వాళ్లకి లేదని బాధపడాలో లేదా వాళ్లందరి బలం మీరే అని సంతోషపడాలో అర్థంకాదు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. ముఖ్యమైన విషయమై దీర్ఘాలోచనలు చేస్తారు. గురువుల ద్వారా ధైర్యాన్ని, మంచి సలహాలను స్వీకరిస్తారు.

## మకరం



మీ శ్రమకు, మీ కష్టానికి ప్రతిఫలాలు అందుకుంటారు. రాజకీయ పైరవీలు లాభిస్తాయి. వాక్చాతుర్యంతో క్లిష్ట పరిస్థితుల్లో నుండి బయట పడతారు. వ్యాపార రంగంలో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. సేల్స్ డిపార్ట్‌మెంట్‌లో వున్నవారికి బాగుంటుంది. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, త్రిశూల్ పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. వ్యాపారులకు రొటేషన్ రూపంలో ఆదాయం ఉంటుంది.

## కుంభం




కార్యాలయంలో కొంతమంది చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను బయట పడవేయాలని మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సాక్ష్యాధారాలతో మీరు రుజువులను నిరూపిస్తారు. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. ఉన్న వాహనాన్ని అమ్మి కొత్త వాహనం కొనుగోలు చేయాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

## మీనం




పట్టుదల, క్రమశిక్షణతో సాధించలేనిది అంటూ ఏమీ లేదు. దేవుడి మీద భారం వేసి ముందడుగు వేస్తారు. మీ ఓర్పు, సహనంతో ఎన్నో విజయాలు సాధిస్తారు. దైవ చింతన కలిగి వుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి వుంటారు. కుక్కలకు, జీవరాసులకు మంచినీళ్ల పెట్టండి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అర్చన జరిపించండి. పితృదేవతల అనుగ్రహంతో కార్యక్రమాలు పూర్తి చేస్తారు.

ఈ వారం కా'ర్టూన్స్'


అసలు పోలీసు వ్యవస్థ ఉందా?
పోలీసుల వల్ల ఎవరికి రక్షణ ఉంది
అని ప్రశ్నిస్తున్నాను..!?


మీ నాయన పదెకరాలు అమ్మేసి నిన్ను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ని
చేసాడు.. ఈ పదేళ్లలో నువ్వు ఒక ఎకరమైనా కొన్నావా?!


ఇటాలియన్ స్కాచ్ బాటిల్ మామా!! దూసుకెళ్తుంది చూడు!!





జలపాతాలను కింది నుంచి చూసి ఆనందించడం సర్వసాధారణం. అయితే దీనికి భిన్నంగా ఉంటుంది చైనాలోని షావోగువాన్‌లో వున్న జలపాతం. సుమారు నూటా డెబ్బై అడుగుల ఎత్తులో వున్న ఈ జలపాతాన్ని చూడాలంటే ఎలివేటర్ లేదా కేబుల్ కార్ల ద్వారా పైకి ఎక్కాలి. యెమన్ పర్వతశ్రేణి మధ్యలో వుందీ జలపాతం.







# ఫోటో ఫీచర్



